మంగళవారం
30-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 308
పేజీలు : 8+టాబ్లాయిడ్, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రఫాపై దాడి...22 మంది మృతి

గాజా: ఆదివారం రాత్రి నుండి సోమవారం వరకు దక్షిణ గాజా నగరమైన రఫాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపినట్లు అసోసియేటెడ్ ప్రెస్ రిపోర్టర్ పేర్కొన్నారు. ఈ దాడిలో 22 మంది మరణించారని తెలిపింది. మృతుల్లో ఆరుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులతో పాటు ఐదు రోజుల నవజాత శిశువు కూడా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. అంతర్జాతీయ సమాజం నుంచి ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా...అమెరికా అండతో ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఇప్పటికే గాజాలో ఇజ్రాయిల్ పెద్దఎత్తున మారణకాండ సాగించింది.

ఏపీ సర్కార్‌కు ఎదురుదెబ్బ

- ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం ఆగ్రహం
- మే 9లోగా అఫిడవిట్ దాఖలు చేయాలి
- యథాతథంగా ఎన్జీటీ తీర్పు అమలుకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ఉన్నతన్యాయస్థానం మండిపడింది. ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, ఎన్జీటీ తీర్పును యథాతథంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇసుక తవ్వకాలపై తీసుకున్న చర్యలపై మే 9వ తేదీలోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తేదీలోపు అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్జీటీ తీర్పుపై ఎలాంటి స్టే విధించలేమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అక్రమాలకు పాల్పడిన వారిపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎన్జీటీని సుప్రీం ఆదేశించింది. ఇసుక తవ్వకాలు జరపడం లేదని అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని జేపీ వెంచర్స్‌కు సైతం ఆదేశాలు జారీచేసింది. పర్యావరణ అనుమతులు లేనిచోట ఇసుక తవ్వకాలు వెంటనే నిలిపివేయాలని, అనుమతులు ఉన్న చోట యంత్రాలు వినియోగించకుండా తవ్వకాలు చేపట్టాలని

- మిగతా 2 లో

తగ్గేదే లే...

- ఎన్‌డీఏలో ఆరని అసమ్మతి
- ఎన్నికల బరిలో రెబల్స్
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- తిరుపతి బరిలో అత్యధికంగా 46 మంది
- 175 అసెంబ్లీ, 25 లోక్‌సభకు అభ్యర్థుల ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. అసెంబ్లీకి, పార్లమెంటుకు నామినేషన్లు దాఖలు చేసిన చాలామంది స్వతంత్ర అభ్యర్థులు, అసమ్మతి నేతలు పోటీ నుంచి తప్పుకున్నారు. అయితే, ఎన్‌డీఏ కూటమికి సంబంధించిన రెబల్స్ మాత్రం నామినేషన్లు వెనక్కి తీసుకోలేదు. అత్యధికమంది ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ, జనసేన అధినేతల బుజ్జగింపు చర్యలు ఫలించలేదు. 175 అసెంబ్లీ స్థానాలకుగాను మొత్తం 4,210 నామినేషన్లు దాఖలు కాగా, అందులో 2,705 ఆమోదం పొందాయి. 25 లోక్‌సభ నియోజకవర్గాలకు 731 నామినేషన్లు రాగా, 503 నామినేషన్లను ఎన్నికల సంఘం ఆమోదించింది. బరిలో ఉన్న స్వతంత్రులకు గుర్తులను ప్రాధాన్యత క్రమంలో ఎన్నికల సంఘం కేటాయించింది. జనసేన గుర్తు గాజు గ్లాసును ఫ్రీ జోన్‌గా కేటాయించడంతో, చాలామంది స్వతంత్రులు గాజుగ్లాసును ఎంచుకోవడం కూటమిలో కలకలం నెలకొంది. తిరుపతి అసెంబ్లీ స్థానానికి అత్యధికంగా 46 మంది, నగరిలో తక్కువగా ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

కడపజిల్లా పులివెందుల అసెంబ్లీకి సీఎం వైఎస్ జగన్‌తోపాటు 27 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కుప్పంలో టీడీపీ అధినేత చంద్రబాబుతోపాటు మరో 17 మంది బరిలో నిలిచారు. మంగళగిరిలో లోకేశ్‌తోపాటు 40 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. టీడీపీ నుంచి టికెట్లు లభించిక...చాలామంది రెబల్స్‌గా నామినేషన్ దాఖలు చేశారు. నూజివీడు, మడకశిర, బద్వేల్, మాడుగుల అసెంబ్లీ స్థానాలలో పోటీ చేసిన రెబల్స్ బరి నుంచి తప్పుకున్నారు. దాదాపు 15 మంది వరకు రెబల్స్ రంగంలో ఉండటంతో ఎన్‌డీఏ కూటమి గందరగోళంలో పడింది. వైసీపీకి సైతం రెబల్స్ బెడద తప్పలేదు. నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగియడంతో..ఎన్డీఏ కూటమి నుంచి వివిధ జిల్లాల నుంచి రెబల్ అభ్యర్థులు బరిలో దిగడంతో కూటమికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఎన్డీఏ కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన నుంచి రెబల్స్ పోటీలో నిలిచారు. అధినాయకత్వాలు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా వారు వెనక్కి తగ్గలేదు. టీడీపీ రెబల్ అభ్యర్థులుగా విజయనగరం అసెంబ్లీకి మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఉన్నారు. ఈమెకు జనసేన గుర్తు గాజు గ్లాసు రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. భీమవరం జిల్లా ఉండి అసెంబ్లీకి మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, పోలవరం అసెంబ్లీకి మోడియం సూర్యచంద్రరావు, అమలాపురం అసెంబ్లీకి పడమటి శీను, సత్యవేడుకు జేడీ రాజశేఖర్, రాప్తాడు అసెంబ్లీకి ప్రొఫెసర్ రాజేశ్ తిరుగుబాటు అభ్యర్థులుగా నిలిచారు. బీజేపీ నుంచి హిందూపురం అసెంబ్లీకి పరిపూర్ణానందస్వామి పోటీ చేస్తున్నారు. గన్నవరం నుంచి గొల్లపోలు శ్రీనివాసరావు, అరకు ఎంపీకి నిమ్మక జయరాజు పోటీ చేస్తున్నారు.

జనసేన నుంచి జగ్గంపేట రెబల్ అభ్యర్థిగా సూర్యచంద్ర పోటీ చేస్తున్నారు. మాడుగలలో వైసీపీ రెబల్‌గా ఉపముఖ్యమంత్రి బూడిగ ముత్యాల నాయుడు కుమారుడు రవి ఉన్నారు. మే 11వ తేదీతో ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. 13న ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులంతా తమ ప్రచారాన్ని వేగవంతం చేశారు.

సీఎం రేవంత్‌కు సమన్లు

- గాంధీభవన్‌కు ఢిల్లీ పోలీసులు
- రేపు విచారణకు రావాలని హుకుం
- అమిత్‌షా ఫేక్ వీడియోల కేసులో అత్యుత్సాహం
- రిజర్వేషన్లపై బీజేపీ రాజకీయ రచ్చ

విశాలాంధ్ర-హైదరాబాద్: లోక్ సభ ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరుకోగా...ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. ఇప్పటికే రెండు విడతల పోలింగ్ ముగియగా... మరో ఐదు విడతల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది... ఈ సమయంలో రిజర్వేషన్ల విషయంలో అటు బీజేపీ.. ఇటు కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. జాతీయ స్థాయిలో రిజర్వేషన్ల అంశంపై రాజకీయ రచ్చ నడుస్తుంటే... తాజాగా ఫేక్ వీడియోల దుమారం రేగింది. దీని సెగ తెలంగాణ కాంగ్రెస్‌ను తాకింది. కాగా ప్రత్యర్థులకు అవకాశం లేకుండా ఈ అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకునేందుకు బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది. దాని ఫలితంగానే ... హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు ఢిల్లీ పోలీసులు వచ్చి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమన్లు జారీచేయడం సంచలనం రేపింది. కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాకు సంబంధించిన నకిలీ వీడియోల కేసులో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా విభాగానికి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వచ్చి... కాంగ్రెస్ అధికార ప్రతినిధి అస్లాం తస్మీన్, పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మన్నె సతీశ్, ఆ పార్టీకి చెందిన నవీన్, శివకుమార్‌లకు నోటీసులు ఇచ్చారు. ఇదే కేసులో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న

- మిగతా 2 లో

విజయవాడ ప్రతిష్ఠ ఇనుమడించాలంటే...

సీపీఐ అభ్యర్థి కోటేశ్వరరావును గెలిపించాలి

- పశ్చిమ నియోజకవర్గ రోడ్ షోలో రామకృష్ణ
- 'ఇండియా' అభ్యర్థులకు అడుగడుగునా ప్రజల నీరాజనాలు

విశాలాంధ్ర-విజయవాడ : ఎంతో ఘన చరిత్ర, ప్రజా చైతన్యం ఉన్న విజయవాడ నగర ప్రతిష్ఠ మరింత ఇనుమడించాలంటే స్థానిక కార్మిక నాయకుడు, ప్రజాబంధువు అయిన సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావును ఈ ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, సీపీఎం బలపర్చిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, విజయవాడ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వల్లూరు భార్గవ్ విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో రామకృష్ణ పాల్గొన్నారు. వన్‌టౌన్ పంజా సెంటర్‌లో రోడ్ షో ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952 సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ నుంచి తమ్మిన పోతరాజు, తరువాత కాలంలో ఉప్పలపాటి రామచంద్రరాజు, కె.సుబ్బరాజు, షేక్ నాసర్ వలి కంకి-కొడవలి గుర్తుపై పోటీ చేసి గెలిచి ఎమ్మెల్యేలుగా ఇక్కడి ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించేలా జరుగుతున్న ఈ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.కోటేశ్వరరావు గతంలో కార్పొరేటర్‌గా పని చేసి ప్రజాసమస్యలను పరిష్కరించారని చెప్పారు. ప్రస్తుతం సీపీఐ విజయవాడ నగర కార్యదర్శిగా ఉండి నిత్యం ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తున్నారన్నారు. సామాన్య కార్యకర్తగా ప్రజల మధ్య ఉండే కోటేశ్వరరావును గెలిపిస్తే చట్ట సభల్లో ప్రజాగొంతుక వినిపిస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వల్లూరు భార్గవ్‌కు 'హస్తం' గుర్తుపై, పశ్చిమ నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావుకు 'కంకి-కొడవలి' గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి సామాన్య వ్యక్తి కాదని, ఈ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో 22 ఎమ్మెల్యే కార్యాలయాలు ఏర్పాటు చేసి తాను మాత్రం హైదరాబాద్, ఢిల్లీలో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని చెబుతున్నారని, అదే కోటేశ్వరరావు అయితే పిలిస్తే పలికేలా నిత్యం అందుబాటులో ఉంటారని

- మిగతా 2 లో

గ్లాసు టెన్షన్

- ఫ్రీ సింబల్‌గా జనసేన గుర్తు
- 21 అసెంబ్లీ, 2 లోక్‌సభకే పరిమితం
- ఎన్‌డీఏ కూటమి కలవరం
- టీడీపీ, జనసేన రెబల్స్, స్వతంత్రులకూ గాజు గ్లాసు
- ఓట్ల బదలాయింపుపై ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఎన్‌డీఏ కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, టీడీపీ, బీజేపీకి గట్టి షాక్ తగిలింది. ఈ పార్టీకి చెందిన గాజు గ్లాసు గుర్తును ఫ్రీ సింబల్ జాబితాలో ఉంచుతూ ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో జనసేన నుంచి పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలకే ఈ గాజు గ్లాసు గుర్తు పరిమితమైంది. సోమవారం నామినేషన్ల ఉప సంహరణ అనంతరం మిగిలిన చాలా చోట్ల పోటీలో ఉన్న అనేక మంది కూటమి రెబల్ అభ్యర్థులకు, స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తును కేటాయించారు. దీనిపై కూటమి పార్టీలో నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ... నిబంధనల మేరకే తాము గాజు గ్లాసు గుర్తును కేటాయించినట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇది గెలుపు, ఓటములపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపుతుందన్న దిశగా కూటమి నేతలు కలవరం చెందుతున్నారు. విజయనగరం అసెంబ్లీ టీడీపీ రెబల్‌గా నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్యే మీసాల గీతకు గాజు గ్లాసు గుర్తును కేటాయించారు. జగ్గంపేటలో జనసేన రెబల్ అభ్యరిగా బరిలో ఉన్న పాఠంశెట్టి సూర్య చంద్రకు గాజు గ్లాసు గుర్తు దక్కింది. ఇక్కడ పొత్తుల్లో భాగంగా టీడీపీ సీటును జ్యోతుల నెహ్రూకు కేటాయించారు. దీంతో జనసేన నుంచి సూర్యచంద్ర తిరుగుబాటు అభ్యర్థిగా నామినేషన్ వేసి గాజు గ్లాసు గుర్తును దక్కించుకున్నారు. ఎస్.కోట జనసేన రెబల్ అభ్యర్థి రామకోటికి గాజు గ్లాసు గుర్తు కేటాయించారు. మచిలీపట్నం, విజయవాడ పార్లమెంట్ పరిధిలోని స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తు కేటాయించినట్లు తెలిసింది. మచిలీపట్నం ఎంపీగా పోటీ చేస్తున్న నవతరం అభ్యర్థికి గాజు గ్లాసు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నీరుగారి పోవడం కాదు,
ఓడిపోతానని తెలిసి రోజూ
కాసేపు లోపలకెళ్లి ఏడుస్తారు!

అసమర్థ సీఎం జగన్

కొయ్యలగూడెం ప్రచార సభలో షర్మిలారెడ్డి 2లో

మాటలు తప్ప చేతకాని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. సోమవారం పోలవరం ఏజెన్సీ ముఖద్వారం అయినా కొయ్యలగూడెం పట్టణంలో గల కన్నాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

కేజ్రీవాల్ బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా 2లో

బాబుకు ఓటేస్తే పథకాలు ఔట్

- వైసీపీతోనే మరింత సంక్షేమం, అభివృద్ధి
- ఆలోచించి నిర్ణయం తీసుకోండి
- ఎన్నికల ప్రచార సభల్లో సీఎం వైఎస్ జగన్

వచ్చే నెలలో జరగనున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2లో

జగన్ శవరాజకీయాలు

చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు విస్మరించి శవ రాజకీయాలు చేస్తున్నారని, పెన్షన్ ఇంటి వద్దనే పంపిణీ చేయాలని కోరితే స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతమంది చనిపోయినా ఫరవాలేదన్నట్లు వ్యవహరిస్తున్నాడని టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. సోమవారం కర్నూలు జిల్లా గూడూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో పెన్షన్ దారులకు పంపిణీ చేయడానికి

- మిగతా 2 లో

నేడు ఎన్డీఏ కూటమి మేనిఫెస్టో విడుదల 2లో

కెన్యాలో డ్యామ్ కూలి 40 మంది మృతి

నైరోబి: ఆఫ్రికా దేశం కెన్యాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ డ్యామ్ కూలిపోవడంతో భారీ ప్రాణనష్టం సంభవించింది. ఈ దుర్ఘటనలో 40 మంది వరకు మృతి చెందారని అధికారులు వెల్లడించారు. కెన్యాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రిఫ్ట్ వ్యాలీకి చెందిన మాయి మహియు పట్టణంలోని కిజాబె డ్యామ్‌లో నీటి ఉద్ధృతి పెరిగి గోడలు కొట్టుకుపోయాయి. ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. దిగువ ప్రాంతాల్లోకి నీరు ప్రవహించింది. పలు ఇళ్లు, ఒక ప్రధాన రహదారి ధ్వంసమైంది. వరదల్లో పలువురు గల్లంతైనట్లు తెలుస్తోంది. "డ్యామ్ ధ్వంసం కావడం వల్ల 40 మంది వరకు మృతి చెందారు. ఇది ఒక అంచనా మాత్రమే. ఇంకా పలువురు బురదలో చిక్కుకొని ఉన్నారు. వారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి" అని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. కాగా, భారీ వర్షాలకు ఇప్పటికే ఈ దేశంలో మరణాలు సంభవిస్తుండగా, డ్యామ్ ఘటనతో ఆ సంఖ్య 120కి చేరింది. ఎల్‌నినో వల్లే సాధారణం కంటే భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో ఇప్పటికే పాఠశాలలకు ఇచ్చిన మధ్యంతర సెలవుల్ని పొడిగించాల్సి వచ్చింది. ఇదిలాఉంటే.. పొరుగుదేశం టాంజానియాలో కూడా వర్షాలు భీభత్సం సృష్టిస్తున్నాయి. దాంతో వరదలు, కొండచరియలు కారణంగా అక్కడ 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

ఐసీసీ అరెస్ట్ వారెంట్ ఇవ్వొచ్చు: ఇజ్రాయిల్

జెరూసలెం: దేశ నేతలకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) నోటీసులు జారీ చేయవచ్చని ఇజ్రాయిల్ అధికారులు సోమవారం పేర్కొన్నారు. గాజాస్ట్రిప్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను నిలిపివేయాలంటూ అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతున్న సంగతి తెలిసిందే. తమ సీనియర్ నేతలు, మిలటరీ అధికారులకు ఐసీసీ వారెంట్ జారీ చేసే అవకాశం ఉన్నట్లు ఇజ్రాయిల్ మిషన్స్ నుండి 'సమాచారం' అందిందని విదేశాంగ మంత్రి కాట్జ్ తెలిపారు. ఇటువంటి వారెంట్లు హమాస్, ఇతర తీవ్రవాద సంస్థలకు మరింత ఉత్సాహం కలిగించవచ్చని ఆరోపించారు. ఇటీవల గాజాకు మరింత మానవతా సాయాన్ని అనుమతిస్తున్నట్లు ఇజ్రాయిల్ వరుస ప్రకటనలు... ఐసీసీ చర్యలను ఎదుర్కొనే లక్ష్యంతోనే కావచ్చని సమాచారం. 2014 ఇజ్రాయిల్ -హమాస్ యుద్ధంపై ఇజ్రాయిల్, పలస్తీనా మిలిటెంట్ల యుద్ధ నేరాలపై ఐసీసీ మూడేళ్ల క్రితం విచారణ చేపట్టింది. అయితే వారెంట్ జారీ చేస్తున్నట్లు ఐసీసీ ఎటువంటి సూచన జారీ చేయలేదు.

ఏపీ సర్కార్‌కు ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. ఇసుక తవ్వకాలపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని పిటిషనర్ నాగేంద్ర కుమార్‌కు సూచించింది. పిటిషనర్ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వానికి సూచించింది. అక్రమార్కులపై క్రిమినల్ చట్టాల మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ...కేసు తదుపరి విచారణను మే 10వ తేదీకి వాయిదా వేసింది. ఎన్నికలు ఉన్నందున అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని ఉన్నతన్యాయస్థానం తోసిపుచ్చింది. ఎన్నికల కన్నా పర్యావరణ అంశాలే ముఖ్యమని ధర్మాసనం తేల్చిచెప్పింది.

పులివర్తి నానికి భద్రత కల్పించండి: హైకోర్టు

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానికి భద్రత కల్పించాలంటూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. టీడీపీ అభ్యర్థికి 1 ప్లస్1 భద్రత కేటాయించాలని ఆదేశించింది. తనకు భద్రత కల్పించాలంటూ ఎస్పీకి పులివర్తి నాని విజ్ఞప్తి చేశారు. అయితే ఎస్పీ నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరగగా...నాని తరపు న్యాయవాది ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు టూ ప్లస్ టూ సెక్యూరిటీ ఇచ్చి... తర్వాత తొలగించారని న్యాయవాది తెలిపారు. భద్రత కల్పించాలని ఎస్పీకి విజ్ఞప్తి చేసినప్పటికీ ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదని ఉమేశ్ చంద్ర చెప్పారు. పోటీ చేసిన అభ్యర్థికి సెక్యూరిటీ ఇవ్వాలి కదా అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ రోజు నుంచి పులివర్తి నానికి, ఆయన కుటుంబ సభ్యులకు 1ప్లస్1 భద్రత కల్పించాలంటూ హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

సీపీఐ అభ్యర్థి కోటేశ్వరరావును గెలిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించి 'ఇండియా' కూటమి తరపున పోటీ చేస్తున్న కోటేశ్వరరావుకు అవకాశం ఇవ్వాలన్నారు. రాజకీయ వ్యాపారం చేసే సుజనా చౌదరి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే చైతన్యవంతమైన విజయవాడ నగరం కూడా అమ్ముడుపోయిందనే చెడ్డ పేరు వస్తుందని హెచ్చరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో వ్యాపారులు, కార్మికులు, రైతులు ఎవరూ బాగుపడలేదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. కులాల, మతాల మధ్య కుంపట్లు పెడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో అన్ని కులాల, మతాల వారు కలిసిమెలిసి ఉండాలనే ఉద్దేశంతో 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇండోనేషియా తరువాత ఎక్కువ మంది ముస్లింలు మన దేశంలోనే ఉన్నారని చెప్పారు. విజయవాడ పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న కేశినేని బ్రదర్స్‌లో ఎవరు గెలిచినా మోదీ చెంతకు చేరుతారన్నారు. పనికిమాలిన దద్దమ్మ మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని, రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని మండిపడ్డారు. ఆర్ అండ్ బీ భవనాలు, సెక్రటేరియేట్ బిల్డింగ్, ప్రభుత్వ స్థలాలు, చివరకు లిక్కర్ వ్యాపారాన్ని తాకట్టు పెట్టి 11 లక్షల కోట్ల రూపాయల అప్పు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడిపించారన్నారు. వివేకానంద రెడ్డి హత్య జరిగి ఐదేళ్లు అయినా హంతకులు ఎవరో చెప్పలేక పోయారన్నారు. చెల్లి కట్టుకున్న చీర గురించి ప్రస్తావించటం... మహానటి అంటూ ట్రోల్ చేయటం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్ దోనేపూడి శంకర్, కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, సీపీఎం నాయకులు బోయ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ షోకు విశేష స్పందన: 'ఇండియా' కూటమి అభ్యర్థులు వల్లూరు భార్గవ్, జి.కోటేశ్వరరావుల విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. రోడ్డు షో జరిగిన రహదారికి రెండు వైపులా ప్రజలు నిలబడి నాయకులకు స్వాగతం పలికారు. ప్రజలకు చేతులెత్తి నమస్కరిస్తూ ముందుకు సాగుతున్న కోటేశ్వరరావుకు చేతులూపుతూ నీరాజనాలు పలికారు. డాబాలపై నిలబడి, షాపుల ముందు నిలుచుని, చిరువ్యాపారులు ఎదురొచ్చి నాయకులను పలుకరించారు. ఎర్రచీరలు ధరించిన మహిళా సమాఖ్య నాయకులు, రెడ్ షర్ట్ వాలంటీర్లు రెండు వరుసలుగా క్రమపద్ధతిలో నడుస్తూ నగర వాసులను ఆకర్షించారు. ముందుగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర నాయకులు షేక్ నజీర్, శర్మ ఎన్నికల ప్రచార గీతాలు ఆలపించారు. ఆటోల ద్వారా కార్యకర్తలు చేసిన మైక్ ప్రచారం ఆకట్టుకుంది. పంజా సెంటర్ వద్ద ప్రారంభమైన రోడ్ షో గణపతిరావు వీధి, కోమలావిలాస్ సెంటర్, లెనిన్ భవన్, సామారంగ్ చౌక్ మీదుగా కాళేశ్వరరావు మార్కెట్ కూడలి వరకు సాగింది.

అసమర్థ సీఎం జగన్

కొయ్యలగూడెం ప్రచార సభలో షర్మిలారెడ్డి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : మాటలు తప్ప చేతకాని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. సోమవారం పోలవరం ఏజెన్సీ ముఖద్వారం అయినా కొయ్యలగూడెం పట్టణంలో గల కన్నాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సందర్భంగా తనకు 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి పోలవరం నిర్మాణం పూర్తి చేస్తానని చెప్పిన జగన్ తన కేసులకు భయపడి మోదీకి మోకరిల్లాడని ఎద్దేవా చేశారు. జిల్లాను ఏం అభివృద్ధి చేశారని జగన్ ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. మద్య నిషేధం తర్వాతే ప్రజల మధ్యకు వచ్చి ఓట్లు అడుగుతానన్న పెద్దమనిషి మద్య నిషేధం ఎక్కడ అమలు చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, రాష్ట్రానికి రాజధాని, పోలవరం నిర్మాణం సమస్య, నిర్వాసితులకు నష్టపరిహారం అపరిష్కృతంగానే ఉన్నాయని విమర్శించారు. 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపిస్తే విభజన హామీలు, ప్రత్యేక హోదా తొలి ప్రాధాన్యతగా పరిష్కరిస్తామని, పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కావూరి లావణ్యకు హస్తం గుర్తుపై ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా

కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలను గద్దె దింపితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకపోవడం, నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ సరిగ్గా ఇవ్వకపోవడం ప్రభుత్వాల అసమర్థత అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఓటు వేసే సమయంలో ప్రజలు ఆలోచించి 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు మళ్లీ ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. రాష్ట్ర సమస్యలపై కూటమి నాయకులు గళం విప్పి ప్రజలను చైతన్యం చెయ్యడానికి వచ్చామన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు తాయిలాలు ఆశలు చూపి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. మత రాజకీయాలకు నిలయంగా దేశాన్ని మార్చారని అన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితులకు నష్టపరిహారం ప్రధాన సమస్యలని, వీటి పరిష్కారం కోసం తనకు, ఆరు నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులకు హస్తం గుర్తుపై, ఏలూరు నియోజకవర్గంలో సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి బండి వెంకటేశ్వరరావుకు కంకి-కొడవలి గుర్తుపై ఓట్లు వేసి చట్టసభలకు పంపాలని కోరారు. పోలవరం నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వేల సృజన మాట్లాడుతూ తెల్లం బాలరాజు నియోజవర్గానికి ఏమి ఒరగబెట్టారని మళ్లీ ప్రజల్లోకి వచ్చి ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడినందుకు నా పై అక్రమ కేసులు పెట్టించారని, ఇలాంటి రాజకీయాలు నీకు మాత్రమే సాధ్యమని బాలరాజుపై విరుచుకుపడ్డారు. పోలవరంలో వైసీపీకి పరాజయం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసు, చింతలపూడి కాంగ్రెస్ అభ్యర్థి ఎలీజ, కాంగ్రెస్ నాయకులు, కునపాము రాజారత్నం, ముప్పిడి చిన్నబాబు, దారం సత్తిరాజు, కారం దారయ్య, సీపీఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

కింది కోర్టులో పిటిషన్ ఎందుకు వేయలేదన్న సుప్రీం

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కేసులో అరెస్టయిన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్‌కోసం ట్రయల్ కోర్టుకు ఎందుకు వెళ్లలేదని సుప్రీంకోర్టు కేజ్రీవాల్ న్యాయవాదిని ప్రశ్నించింది. దిల్లీ మద్యం కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన అరెస్టు, కస్టడీని సవాల్ చేస్తూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈ కేసులో బెయిల్ కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారా? అని కేజ్రీవాల్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తా ధర్మాసనం ప్రశ్నించింది. తాము ఎలాంటి పిటిషన్ వేయలేదని సింఘ్వీ తెలపగా... బెయిల్ కోసం ముందు ట్రయల్ కోర్టుకు ఎందుకు వెళ్లలేదని అడిగింది. ఈ కేసులో కేజ్రీవాల్ అరెస్టు అక్రమమని, అందుకే తాము ఎలాంటి పిటిషన్లు వేయలేదని సింఘ్వీ ధర్మాసనానికి తెలిపారు. కేవలం సమన్లకు హాజరుకాలేదన్న కారణంతో అరెస్టు చేయడం సరికాదని గట్టిగా వాదనలు వినిపించారు. కాగా ధర్మాసనం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

తీహార్ జైల్లో కేజ్రీవాల్‌ను కలిసిన సతీమణి సునీత

ఈ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేజ్రీవాల్‌ను చేయగా... ఏప్రిల్ 1 నుంచి ఆయన తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే సీఎంను కలిసేందుకు ఆయన సతీమణిని జైలు అధికారులు అనుమతించడం లేదని సోమవారం ఉదయం ఆప్ వర్గాలు ఆరోపించాయి. ఈ క్రమంలోనే సునీత అభ్యర్థనను జైలు అధికారులు అంగీకరించారు. దీంతో మధ్యాహ్నం మంత్రి ఆతిశితో కలిసి

ఆమె తీహార్ జైలుకు వెళ్లి కేజ్రీవాల్‌ను కలిశారు. అనంతరం ఆతిశి మీడియాతో మాట్లాడుతూ... 'నన్ను చూడగానే సీఎం ఒకటే అడిగారు. పనులు ఎలా జరుగుతున్నాయి? స్కూల్ పిల్లలకు పుస్తకాలు అందాయా? మొహల్లా క్లినిక్‌లలో ఔషధాలు సరిపడా ఉన్నాయా? అని ఆరా తీశారు. తాను కచ్చితంగా బయటకు వస్తానని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని ప్రజలకు చెప్పాలని సందేశం పంపారు' అని వెల్లడించారు.

బాబుకు ఓటేస్తే పథకాలు ఔట్

విశాలాంధ్ర-చోడవరం(అనకాపల్లి): వచ్చే నెలలో జరగనున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాయ మాటలతో ముందుకు వస్తున్న చంద్రబాబు చేతిలో మోసపోవద్దని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన చోడవరం, పి.గన్నవరం, పొన్నూరులో జరిగిన వైసీపీ సభల్లో మాట్లాడారు. ఐదేళ్ల పాటు ప్రతి ఇంటికి సంక్షేమాన్ని, ప్రతి పల్లెకు అభివృద్ధిని అందించామని రానున్న రోజుల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి కావాలంటే మీ బిడ్డను దీవించాలంటూ కోరారు. మాయ మాటలతో ప్రజలను బురిడి కొట్టించే చంద్రబాబు నమ్మి మోసపోవద్దని చెప్పారు. బాబు వస్తే పథకాలు కొనసాగవన్నారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలు శుష్క వాగ్దానాలుగా మిగిలిపోయాని... పేదలకు అండగా ఉండేది ఒక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. చంద్రబాబును నమ్మితే పేదల బతుకులు అతలాకుతలమవుతాయని చెప్పారు. ఇంటింటికి ఉద్యోగం ఎక్కడ ఇచ్చారని, నిరుద్యోగ భృతి ఎవరికి అందిందని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ ఎక్కడ జరిగిందన్నారు. ఆడపడుచులు బంగారాన్ని

బ్యాంకుల నుంచి విడిపిస్తామని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి బురిడీ కొట్టించారన్నారు. ప్రతి ఆడబిడ్డకు 25,000 డిపాజిట్ చేస్తానని చెప్పి ఎవరికీ డిపాజిట్ చేశారని ప్రశ్నించారు. పేదవాడికి సెంటు స్థలం కూడా ఇవ్వలేని వ్యక్తి ఓటుకు నోటు కేసులో దొరికిపోయి ప్రజలకు సమాధానం చెప్పలేకపోయారని జగన్ పేర్కొన్నారు. ఏపీని సింగపూర్ లో తయారు చేస్తానని గ్రాఫిక్స్ చూపించిన చంద్రబాబుకు అందమైన విశాఖపట్నం కనపడలేదా అంటూ ప్రశ్నించారు. మరలా సూపర్ సిక్స్ పేరుతో ప్రజల వద్దకు వస్తున్న చంద్రబాబు మాటలు నమ్మితే మరోసారి మోసపోక తప్పదని చెప్పారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించారని చెబుతున్న చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారని... ఆ దాచుకున్న డబ్బుతో ప్రజలను కొనాలని చూస్తున్నారని విమర్శించారు. 'అది మన సొమ్ము, ప్రజల సొమ్ము ఇచ్చిన డబ్బులు తీసుకోండి కానీ ఆలోచించే ఓటు వేయండి సంక్షేమం కావాలా మాయమాటలు కావాలో తెలుసుకోండి' అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తును సంక్షేమాన్ని అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వం చోడవరం అభివృద్ధికి ఏం చేసిందని ప్రశ్నించారు. గోవాడ షుగర్స్ ని నష్టాల పాలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సౌమ్యుడు, మంచివాడైన చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని మరోసారి ఆదరించాలని తద్వారా చోడవరానికి మంచి భవిష్యత్తు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోపక్క అనకాపల్లి ఎంపీగా బీ ముత్యాల నాయుడుని కూడా ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పదేపదే చంద్రబాబును ఉటంకిస్తూ గోవిందా గోవిందా అంటుంటే వైసీపీ కార్యకర్తలు కేరింతలు కొట్టడం కనిపించింది. ఈ సభలో బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ మరో అవకాశం ఇవ్వాలని ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా చోడవరం ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి కోసం వేలాదిగా ప్రజలు ఎదురుచూశారు. కొత్తూరు జంక్షన్ నుంచి వినాయకుని గుడి వరకు, పీఎస్ పేట రోడ్డు, దేవరపల్లి రోడ్డు, గోవాడ రోడ్డు కూడా వైసీపీ కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది.

సీఎం రేవంత్‌కు సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డికి కూడా సమన్లు జారీ చేసినట్లు సమాచారం. మే 1న ఫోన్ తీసుకొని విచారణకు హాజరుకావాలని చెప్పినట్లు తెలిసింది. అమిత్‌షా మార్ఫింగ్ వీడియోను రేవంత్ 'ఎక్స్'లో పోస్టు చేశారని దిల్లీ పోలీసులు ఆరోపిస్తున్నారు.

రిజర్వేషన్ల రద్దుపై అమిత్ షా నకిలీ వీడియో

దిల్లీలో కేసు నమోదు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేరిట వైరలవుతున్న కొన్ని నకిలీ వీడియోలపై దిల్లీ ప్రత్యేక విభాగం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ వీడియో ఎవరు తయారుచేశారన్న విషయమై స్పెషల్ సెల్ ఇంటిలిజెన్స్ (ఐఎఫ్ఎస్ఓ) దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు లో వివిధ రాష్ట్రాల్లోనూ కేసులు నమోదయ్యాయి. త్వరలో దేశవ్యాప్తంగా అరెస్టులు ఉండే అవకాశం ఉందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. సదరు వీడియోలను షేర్ చేసిన వారిని అదుపులోకి తీసుకోవచ్చని తెలిపాయి. ఎడిట్ చేసి దుష్ప్రచారం చేస్తున్న ఇలాంటి వీడియోల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఫిర్యాదులో హోంమంత్రిత్వశాఖ పేర్కొంది. వీడియోలను ఎక్కడి నుంచి షేర్ చేశారో తెలియజేసే కొన్ని లింకులను కూడా జత చేసింది. అమిత్ షా ఈ నెల 23న తెలంగాణలో జరిగిన విజయ సంకల్ప సభలో పాల్గొన్నారు. అక్కడ మాట్లాడుతూ "బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ విరుద్ధమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన ఆ హక్కులను తిరిగి వారికే ఇచ్చేస్తాం" అని వ్యాఖ్యానించారు. దీన్ని కొంతమంది వక్రీకరించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్‌ను రద్దు చేస్తామని షా చెబుతున్నట్లుగా ఎడిట్ చేశారని బీజేపీ ఆరోపిస్తోంది. దీన్ని తీవ్రంగా ఖండించిన పార్టీ అధికార ప్రతినిధి అమిత్ మాలవీయ చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని ఇటీవల హెచ్చరించారు. ఇక అమిత్‌షా ప్రసంగించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో కేంద్ర హోంశాఖ తీవ్రంగా పరిగణించింది. ఇది సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వీడియోను కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న వివిధ సోషల్ మీడియా ఖాతాలు షేర్ చేసినట్లు బీజేపీ ఆరోపిస్తోంది.

ఒకే కారణంతో రెండుసార్లు సస్పెన్షన్

క్యాట్‌లో ఏబీవీ పిటిషన్‌పై తీర్పు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్‌లో రాష్ట్ర ఇంటిలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు కేసుపై విచారణ జరిగింది. తనను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటికే పిటిషనర్ తరపు న్యాయవాది ఆదినారాయణ వాదనలు వినిపించారు. ఒకే కారణంతో ఏబీ వెంకటేశ్వరరావును రెండు సార్లు సస్పెండ్ చేశారని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వాదించారు. పిటీషనర్‌పై సరైన కారణాలు లేకుండానే కక్షపూరితంగా వ్యవహరిస్తోందని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను కొన్నింటిని ఉదాహరిస్తూ, పిటీషనర్‌కు న్యాయం చేయాల్సిందిగా కోరారు. మరోవైపు ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏజీ శ్రీరామ్ వాదిస్తూ... అభియోగపత్రం దాఖలు చేసి వాదనలు ముగిసే వరకు సస్పెండ్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. రెండుపక్షాల వాదనలు విన్న ట్రిబ్యునల్ తీర్పును వాయిదా వేసింది.

నేడు ఎన్డీఏ కూటమి మేనిఫెస్టో విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్డీఏ (టీడీపీ, బీజేపీ, జనసేన) కూటమి తన ఎన్నికల మేనిఫెస్టోను మంగళవారం విడుదల చేయనుంది. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో మధ్యాహ్నం, మూడు పార్టీల నేతలు దీనిని ఆవిష్కరించనున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో పాటు బీజేపీ ముఖ్యనేతలు హాజరుకానున్నారు. వైసీపీ ఇప్పటికే తన మేనిఫెస్టోను విడుదల చేసిన నేపథ్యంలో దానికి ధీటుగా ప్రజల అవసరాలు, ఆకాంక్షలను నెరవేర్చేలా మేనిఫెస్టోను తీర్చిదిద్దినట్లు ఎన్డీఏ నేతలు పేర్కొంటున్నారు. 'రాష్ట్ర ప్రజల అవసరాలు తీరుస్తాం... రేపటి ఆకాంక్షలను సాకారం చేస్తాం', 'పన్ను బాదుడు లేని సంక్షేమం-ప్రతి ప్రాంతం అభివృద్ధే లక్ష్యం' తదితర నినాదాలతో ఉమ్మడి మ్యానిఫెస్టో రూపొందించినట్లు విశ్వసనీయ సమాచారం. అప్పులు, పన్నులతో ఇచ్చేది సంక్షేమం కాదని, సంపద సృష్టితో సంక్షేమం ఇస్తామనే హామీని దీని ద్వారా వెల్లడించనున్నట్టు తెలుస్తోంది. ప్రజలు, వివిధ వర్గాల వినతులు, అగ్రనేతల ఆలోచనలు, హామీల కలబోతగా మ్యానిఫెస్టోను రూపొందించినట్లు తెలిసింది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజల వ్యక్తిగత జీవితాల్లో మార్పు తెచ్చేలా ఒక్కో పథకం ఉంటుందని కూటమి నేతలు చెబుతున్నారు.

జగన్ శవరాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

డబ్బులు లేక ఆలస్యం చేశారని ఆరోపించారు. వేసవి వేడికి తట్టుకోలేక 33 మంది వృద్ధులు మృతి చెందారని, అవి ప్రభుత్వ హత్యలేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలు జరుగుతున్నందున ప్రభుత్వ యంత్రాంగమంతా ఎన్నికల సంఘం కింద పని చేయాలని, ఈ సమయంలో ఇలా కుట్రలు చేయడం దుర్మార్గమన్నారు. పెన్షన్‌ను ఇంటి వద్దే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీఎస్‌కు, గవర్నర్‌కు, ఎన్నికల సంఘానికి ఎన్డీఏ కూటమి ఫిర్యాదు చేసిందన్నారు. 41,200 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, వారి ద్వారా పంపిణీ చేయమంటే వారు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారని అంటున్నారని, ఎన్నికలు మే 13న ఉంటే అప్పుడే స్లిప్పులు ఎలా పంపిణీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. 33 మంది మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బాబాయిని గొడ్డలి పోటు, గులకరాయి డ్రామా, శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను తాము ఖండిస్తున్నామన్నారు.

'గ్లాసు' టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించారు. ఈ పరిణామాలతో ఎన్డీఏ కూటమి నేతలు ఆందోళన చెందుతున్నారు. 2014లో జనసేన ఎక్కడా పోటీ చేయలేదు. ఎన్డీఏ కూటమికి మద్దతు ఇచ్చింది. మళ్లీ 2019లో వామపక్ష, బీఎస్పీ పార్టీల మద్దతుతో బరిలో నిలిచింది. 2024 ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు ఎన్డీఏ కూటమి పార్టీలు పోటీ చేస్తున్నాయి. ఈ కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా జనసేనకు 21 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలు వచ్చాయి. ఆయా నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులు నామినేషన్లు వేసి... గాజు గ్లాసు గుర్తుపై ప్రచారం చేస్తున్నారు. జనసేన అంటేనే.. గాజు గ్లాసు గుర్తుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులకు గుర్తుకు వస్తుంది. ఎన్డీఏ కూటమి తరపున జనసేనకు మినహాయించి, మిగిలిన అసెంబ్లీ, లోక్‌సభ సీట్లలో టీడీపీ, బీజేపీ పోటీ చేస్తున్నాయి. ఈ స్థానాల్లో స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇక్కడే కూటమికి అసలు సమస్య ఎదురవుతున్నది. ఈ స్వతంత్ర అభ్యర్థులలో కొందరి కోరిక మేరకు జనసేన గుర్తు గాజు గ్లాసును ఎంచుకున్నారు. దానివల్ల టీడీపీ, బీజేపీ పోటీచేసే స్థానాల్లో జనసేన ఉందని భావించి, గాజు గ్లాసుకు ఓటర్లు ఓటు వేస్తారన్న ఆందోళన కూటమిలో ఉంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నమ్ముకున్న తన సొంత సామాజికవర్గం అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులు కోరుకుంటే... టీడీపీ, బీజేపీకి తీవ్ర ప్రభావం చూపనుంది.

ఈ పార్టీలతో జనసేనకు టెన్షన్

మరోవైపు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ, జాతీయ జనసేన పార్టీలు పవన్ కల్యాణ్‌ను ఆందోళన కలిగిస్తున్నాయి. మొన్నటివరకు జనసేన గాజు గ్లాసు గుర్తును రద్దు చేయాలంటూ ఆ పార్టీలు ప్రయత్నించాయి. ఇప్పుడు నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి జనసేన గాజు గ్లాసు గుర్తును పోలిన బక్కెట్ గుర్తు వచ్చింది. దానికితోడుగా జనసేన అభ్యర్థుల పేర్లతోనే నవరంగ్ కాంగ్రెస్ పార్టీ 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాల్లో పోటీ పెట్టింది. జాతీయ జనసేన పార్టీ గుర్తు... పెన్నుల సెట్ బాక్సుగా వచ్చింది. ఇది కూడా జనసేన గాజు గ్లాసు గుర్తుకు దగ్గరగా ఈవీఎంలో ఉంటుంది. ఓటర్లు తికమక పడి, జనసేనకు గ్లాసుకు బదులుగా బక్కెట్ లేదా పెన్నుల సెట్ బాక్సుపై ఓట్లు వేస్తారన్న ఆందోళన జనసేన నేతలను పీడిస్తోంది. జనసేనతో పొత్తు పెట్టుకున్నందుకు ప్రతిఫలంగా టీడీపీ, బీజేపీకి దిక్కుతోచడం లేదు. టీడీపీ, బీజేపీ పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో జనసేన గుర్తు గాజు గ్లాసును స్వతంత్రులు తీసుకుంటే, తమకు వచ్చే ఓట్లన్నీ స్వతంత్రులకు కొంతమేర తరలిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు జనసేన పొత్తు, ఆ సామాజిక బలం ఉంటుందని ఆశించిన బీజేపీ, టీడీపీకి పెద్ద షాక్ తగిలింది. ఎన్డీఏ కూటమిలో జనసేన చేరినప్పటికి నుంచి ఆ పార్టీకి చెందిన ముఖ్యమైన నేతలు రాజీనామా బాటపట్టారు. వారిలో అధికంగా వైసీపీ గూటికి చేరారు. జనసేన నుంచి అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపాటుకు గురైన వారంతా తిరుగుబావుటా ఎగురవేశారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి జనసేన పొత్తుతో పూర్తిబలం చేకూరుతుందని ఆశించిన టీడీపీ, బీజేపీకి నిరుత్సాహం మిగిలింది. అధికంగా ఉభయ గోదావరి జిల్లాల నుంచే జనసేన నేతలు పార్టీని వీడి, పవన్‌పై తిరుగుబావుటా ఎగురేస్తున్నారు. ఈ జిల్లాల్లో చాలా నియోజకవర్గాల్లో జనసేన ఖాళీ అయిపోయింది. రోజుకొకరు పార్టీని వీడుతూ, పవన్ వ్యవహార శైలిపై నిప్పులు చెరుగుతున్నారు. దీంతో ఎన్డీఏ కూటమి పార్టీలకు దిక్కుతోచడం లేదు. ఎన్నికల ప్రచారానికి కేవలం 12 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ అతి తక్కువ సమయంలో మూడు పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు ప్రశ్నార్థకంగా మారింది.

మోదీ గెలిస్తే అంబేద్కర్ రాజ్యాంగం అమలు కష్టమే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల అనంతరం బీజేపీ మళ్లీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితే వస్తే... అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి బదులుగా నరేంద్ర మోదీ దుష్ట రాజ్యాంగాన్ని తీసుకువస్తాడని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. మంగళగిరిలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. సమావేశానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ముఖ్య అతిథులను ఆహ్వానించగా... ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలన్నారు. నరేంద్ర మోదీ మళ్లీ గెలిస్తే దేశానికి ఎన్నికలే ఉండవని, ఇవే చివరి ఎన్నికలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులందరూ ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి అగ్రిగోల్డ్ సమస్యలను పరిష్కరించేలా హామీ తీసుకోవాలని, మంగళగిరిలో కూడా ఆయా అభ్యర్థుల నుంచి స్పష్టమైన హామీ తీసుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక పింఛన్లను ఈ నెల 3వ తేదీ లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేయాలని, బ్యాంకు ఖాతా లేనివారికి ఇంటికి వచ్చి పెన్షన్లు ఇస్తామని జీవో ఇచ్చారని... అది సక్రమంగా అమలు చేయాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా అధికారంలోకొస్తే మద్యపాన నిషేధం చేస్తామన్న జగన్‌మోహన్ రెడ్డి అదే మద్యాన్ని ఏరులై పారిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని ముప్పాళ్ల దుయ్యబట్టారు. కేసులకు భయపడి రాష్ట్రాన్ని మోదీకి తాకట్టు పెట్టారని... రాజధాని ప్రాంతాన్ని నిర్వీర్యం చేసి మూడు రాజధానుల పేరుతో నాటకాలాడి రాజధాని రైతులను మోసం చేశాడన్నారు. ఎప్పుడూ ప్రజల పక్షాన ఉండి పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించి... చట్టసభలకు పంపితేనే ప్రజలు ప్రశాంతంగా ఉంటారని ఓటర్లకు ముప్పాళ్ల విజ్ఞప్తిచేశారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా ఇండియా కూటమి బలపర్చిన సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌ను కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని, అలాగే మంగళగిరి నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకర్‌కు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, జె.సాంబశివరావు, చిన్ని సత్యనారాయణ, బత్తూరి మోహనరావు, మానికొండ దాంగే, మునగాల రామారావు, బి.అంజిబాబు, బి.శ్రీనివాసరావు, బి.శంకర్రావు, గంజి వెంకయ్య, ఉయ్యాల సత్యనారాయణ, మరియదాసు, పి.మరియదాసు, బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు బ్రేక్

అమలు చేయడం లేదని మంత్రి ధర్మాన ప్రకటన

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని, దీనిని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని చెప్పిందని రాష్ట్ర రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. దీనిని అన్ని రాష్ట్రాలు అమలు చేసిన తర్వాతే తాము అమలు చేస్తామని ప్రకటించారు. ప్రతిపక్షాల నుంచి వచ్చిన నేపథ్యంలో ఈ చట్టం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ చట్టంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు మీద ధర్మాన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ చట్టం తీసుకొచ్చిన బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ...దీనిపై తప్పుడు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ విషయం న్యాయస్థానాల పరిధిలో ఉందని, తీర్పు తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజల భూములతో వ్యాపారం చేసే చరిత్ర టీడీపీదని, ప్రజలకు ఇళ్ల పట్టాలు పంచిన ఘనత జగన్‌దని చెప్పారు. వైసీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓటమి భయంతో టీడీపీ ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. సమగ్ర భూ సర్వేతో రైతులకు మేలు చేయాలని వైసీపీ ప్రభుత్వం సర్వే చేసి అన్ని రికార్డులను సరి చేస్తున్నదన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకువచ్చిన కార్డ్ 2.0 అనే ప్రాజెక్టు మీద విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయని విమర్శించారు. ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్, ఎక్కడ నుంచి ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం కల్పిస్తూ ఆటోమ్యుటేషన్, ఈసీ జారీ, స్టాక్ హోల్డింగ్ ఇంటిగ్రేషన్ తదితర విషయాలకు సంబంధించిన సాఫ్టువేర్ మాత్రమే అన్నారు. భూమి రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆన్లైన్‌లో ఆటో మ్యుటేషన్ అయి ఈ- పాస్ బుక్ జనరేట్ అవుతుందన్నారు. ఇలాంటి విషయాల్లో టీడీపీ దిగజారుడు రాజకీయాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచెయ్యడం సిగ్గుచేటన్నారు. టీడీపీ ఎన్ని కుటిల రాజకీయాలు చేసినా వైసీపీ విజయాన్ని ఆపలేరని, టీడీపీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో అందవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కులాల మధ్య జగన్ చిచ్చు: పవన్

విశాలాంధ్ర-జగ్గంపేట/కిర్లంపూడి: సీఎం జగన్ కులాల మధ్య చిచ్చురేపుతున్నారని, అన్ని కులాలను సమానంగా చూసేవాడే నిజమైన నాయకుడని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ఆదివారం రాత్రి జరిగిన వారాహి విజయభేరి సభలో పవన్ మాట్లాడుతూ వైసీపీ నేతలు కొండలు, చెరువులను కబ్జా చేశారని ఆరోపించారు. యువత బాగుకోసం నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తానని భరోసా ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చాక జగ్గంపేట నియోజకవర్గంలో సమస్యలను పరిష్కారమన్నారు. సినిమా నటులకు ఏం తెలుసని కిర్లంపూడిలో నాయకులు అంటున్నారని, సినిమా నటులు మనుషులు కాదా వారికి సామాజిక బాధ్యత ఉండదా అంటూ ముద్రగడను పరోక్షంగా ప్రశ్నించారు. కాపులకు రిజర్వేషన్ ఇవ్వను అని చెప్పిన జగన్‌ను కాపు ఎమ్మెల్యేలు ఎందుకు నిలదీయటంలేదని ప్రశ్నించారు. ఐదుశాతం ఉన్న ఈబీసీ రిజర్వేషన్‌ను జగన్ ఎందుకు రద్దు చేశారన్నారు. కాపు రిజర్వేషన్ ప్రారంభించి ముద్రగడ ఎందుకు వదిలేశారని అన్నారు. కాపు ఉద్యమంలో రైలు దగ్ధానికి కీలక పాత్ర పోషించింది వైసీపీవారేనని ఆరోపించారు. జగన్‌కు మరొకసారి అవకాశం ఇస్తే మీదనున్న భూమి, ఇళ్లను కాజేస్తారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టో తు.చ. అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థిని నెహ్రూను, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

బీజేపీ, వైసీపీని సమాధి చేయాలి

ఈశ్వరయ్య

విశాలాంధ్ర-బద్వేలు: మే 13న జరగనున్న లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో దేశాన్ని దోచుకున్న బీజేపీని, రాష్ట్రాన్ని దోచుకున్న వైసీపీని సమాధి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ బీజేపీ తన సమాధిని తానే తవ్వుకుంటుందన్నారు. భారతదేశ ఎన్నికలను హిందూ-ముస్లిం యుద్ధంగా మార్చాలని ప్రధాని మోదీ భావించి, విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నాడని విమర్శించారు. రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగం, అధిక ధరలు, రైతుల కష్టాలపై ప్రధాని మోదీ స్పందించడని, ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న అతి ముఖ్యమైన సమస్యలపై చర్చించడానికి కూడా మోదీ ఇష్టపడడని ధ్వజమెత్తారు. అధికారం చేజిక్కించుకోవడం కోసం కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేయడం, ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టడం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడం చేస్తుంటాడని అన్నారు. ప్రధాని మోదీ హామీలకు జవాబుదారీతనం లేదని, దేశ ప్రజలు బీజేపీని విశ్వసించడం లేదని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి?, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం ఏమైందని ఆయన ప్రశ్నించారు. మైనారిటీలు, మహిళలు, దళితులు, ఆదివాసీలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మోదీ పూర్తి నియంతలా మారి ప్రజల స్వేచ్ఛ, హక్కులను కాలరాస్తాడని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఉండదని, నియంతృత్వ పాలన కొనసాగుతుందని తెలిపారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను కాపాడుకోవలసిన తక్షణ అవసరం ఉందని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, వైసీపీ, టీడీపీ, జనసేనను చిత్తుగా ఓడించి, రాజ్యాంగాన్ని రక్షిస్తామని హామీ ఇస్తున్న 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

గిరిజన ప్రాంతాల్లో ఇళ్లవద్దే పింఛన్లు ఇవ్వాలి

ఈసీకి హెచ్ఆర్ఎఫ్, లిబ్‌టెక్ ఇండియా లేఖ

విశాఖపట్నం: గిరిజన ప్రాంతాల్లో సామాజిక భద్రత పెన్షన్‌లను ఇంటివద్దనే పంపిణీ చేయాలని మానవహక్కుల ఫోరం (హెచ్ఆర్ఎఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ , లిబ్‌టెక్ ఇండియా ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు హెచ్ఆర్ఎఫ్ అధ్యక్షుడు వీఎస్ కృష్ణ, లిబ్‌టెక్ ఇండియా సీనియర్ రీసెర్చర్ బుద్ధా చంద్రశేఖర్‌లు భారత ఎన్నికల సంఘం ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. ఎన్నికల నేపథ్యంలో సామాజిక పింఛన్లు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేయాలని ఆదివారం ఏపీ ప్రభుత్వం సర్క్యులర్ జారీచేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్నవారికి, దివ్యాంగులకు ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేయడాన్ని అభినందిస్తూనే... డీబీటీ విధానం మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన లబ్ధిదారులకు సమస్యల్ని సృష్టిస్తుందని తెలిపారు. వారికి బ్యాంకింగ్ సౌకర్యాలు పరిమితంగా ఉండటంతో పాటు సమీప బ్యాంక్ బ్రాంచ్/బిజినెస్ కరస్పాండెంట్లు/కస్టమర్ సర్వీస్ పాయింట్లను చేరుకోవడానికి చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుందని తెలిపారు. మండుటెండల్లో వారు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది వారిపై ఆర్థికభారం మోపడమేనని తెలిపారు. అదీగాక పింఛన్లు డ్రా చేయడానికి వెళ్లినప్పుడు గిరిజన లబ్ధిదారుల వద్ద అధిక మొత్తంలో కమీషన్లు వసూలు చేస్తారని గతంలో లిబ్‌టెక్ ఇండియా నిర్వహించిన పరిశోధనలో తేలిందని చెప్పారు. ఇదిగాక బీసీ/సీఎస్‌పీ అవుట్‌లెట్లలో గిరిజనులు మోసపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. ఇంతకుముందు నగదు పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేసే విధానం గిరిజన లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చేయడంలో కీలకపాత్ర పోషించిందని తెలిపారు. దీనిపై సోదోహరణంగా లేఖలో వివరించారు. కావున తమ విజ్ఞాపనను పరిగణలోకి తీసుకుని గిరిజన ప్రాంతాల్లో ఇంటివద్దనే పింఛన్ల పంపిణీ కొనసాగించాలని వారు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

పుట్టినరోజు వేడుకలకు వెళ్లి తిరిగిరాని లోకానికి...

- రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం, మరో నలుగురికి తీవ్రగాయాలు
- కుటుంబాల్లో విషాదం... కన్నీరుమున్నీరౌతున్న తల్లిదండ్రులు

విశాలాంధ్ర-మామిడికుదురు: పుట్టినరోజు వేడుక ఆయా కుటుంబాల్లో పెనువిషాదాన్ని నింపింది. సంతోషంగా వెళ్లివస్తారనుకుంటే... తిరిగిరాని లోకానికి చేరుకోవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. చేతికందివచ్చిన బిడ్డలు చేయిదాటిపోవడంతో కన్నీరుమున్నీరు అవు తున్నారు. వివరాలివి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన కొల్లాబత్తుల జతిన్ ... తన పుట్టినరోజును పురస్కరించుకొని స్నేహితులకు పార్టీ ఇవ్వాలనుకున్నాడు. యానంలో పార్టీ చేసుకోవాలని నిర్ణయించుకున్న ఎనిమిది మంది యువకులు స్నేహితుడి ఆటోలో ఆదివారం ఉదయం అక్కడికి బయలుదేరి వెళ్లారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం దొరకడంతో పూటుగా తాగి తిరిగి ఆటోలో స్వస్థలాలకు వస్తున్నారు. అమలాపురం సమీపంలోని భట్నవిల్లి జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఎదురుగా వస్తున్న లారీని వీరు ప్రయాణిస్తున్న ఆటో బలంగా ఢీ కొట్టడంతో నలుగురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయ పడ్డారు. మృతుల్లో ముగ్గురు మామిడికుదురు మండలంలోని నగరం, పాశర్లపూడి గ్రామాలకు చెందిన వారు కాగా, మరో యువకుడు పి.గన్నవరం మండలంలో మానెపల్లికి చెందిన వాడిగా గుర్తించారు. నగరం గ్రామానికి చెందిన సాపే నవీన్ (22), కొల్లాబత్తుల జతిన్ (26), పాసర్లపూడికి చెందిన నల్లి నవీన్ కుమార్ (27), మానేపల్లి గ్రామానికి చెందిన వల్లూరి అజయ్ (18) దుర్మరణం చెందారు. క్షతగాత్రులైన పాసర్లపూడికి చెందిన మల్లవరపు వినయ్ బాబు (17), మార్లపూడి లోకేశ్ (17), పెదపట్నం గ్రామానికి చెందిన జాలెం శ్రీనివాసరెడ్డి (17), నగరం గ్రామానికి చెందిన మాదాసి ప్రశాంత్ కుమార్ (16) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సమూహ సదస్సుపై ఏబీవీపీ దాడి

డా.పసునూరి రవీందర్, నరేశ్ కుమార్‌కు గాయాలు

అరసం, ఏఐవైఎఫ్, డీహెచ్‌పీఎస్ ఖండన

వరంగల్/హైదరాబాద్: వరంగల్‌లో ఏబీవీపీ గూండాలు రెచ్చిపోయారు. వరంగల్‌లో 'లౌకిక విలువలు-సాహిత్యం' అంశంపై జరిగిన సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ సదస్సు మీద విచక్షణారహితంగా దాడి చేశారు. బ్యానర్లు చించివేశారు. ఏబీవీపీ గొడవతో రచయితలు సభ త్వరగా ముగించుకొని బయటికి వెళుతుండగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా.పసునూరి రవీందర్ మీద, కవి నరేశ్‌కుమార్ సూఫీ మీద దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. ఏబీవీపీ దౌర్జన్యకాండను అనేక సాహిత్య సంస్థలు, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. సమూహ, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం తీవ్రంగా ఖండించాయి.

పెనుగొండ, వేల్పుల ఖండన

లౌకిక రచయితల ఫోరమ్(సమూహ) రాష్ట్ర సదస్సుపై దాడి చేసి బ్యానర్లు చింపివేసి రచయితలను దుర్భాషలాడుతూ భౌతికదాడికి దిగిన మతోన్మాద ఏబీవీపీ చర్యలను అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ, జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నిందితులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో మతోన్మాద ఫాసిస్టు శక్తులు మతాల పేరిట లౌకిక వ్యవస్థను, భావస్వేచ్ఛను కాలరాస్తూ...ప్రజల మధ్య చీలికలు తీసుకువస్తున్నాయని విమర్శించారు. మతోన్మాదుల దుశ్చర్యలకు ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. మతోన్మాదుల దాడిని ఏపీ, తెలంగాణ అరసం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరు శివప్రసాద్, పల్లేరు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ తీవ్రంగా ఖండించారు.

దాడి హేయం: ఏఐవైఎఫ్

ప్రముఖ కవులు ప్రొఫెసర్ కాత్యాయిని, డాక్టర్ పసునూరి రవీందర్, నరేశ్ కుమార్ సూఫీ, మెర్సీ మార్గరెట్‌పై ఏబీవీపీ గూండాల దాడిని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కునుకుంట్ల శంకర్, సత్య ప్రసాద్, శ్రీమాన్ తదితరులు ఖండించారు.

ప్రముఖ కవులు డాక్టర్ పసునూరి రవీందర్, నరేశ్ కుమార్ సూఫీ, మెర్సీ మార్గరెట్‌పై జరిగిన దాడిని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఖండించారు. దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తితో సాహిత్య సదస్సు జరుపుతుంటే... ఫాసిస్టులు మూక దాడికి పాల్పడటం భావ ప్రకటనా స్వేచ్ఛ మీద దాడి చేయడమేనని ఆయన అన్నారు.

విశాఖకు ఆంధ్రుల ఆత్మగౌరవ యాత్ర

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: ఆంధ్రుల ఆత్మగౌరవ యాత్ర సోమవారం విశాఖపట్నం చేరుకుంది. ఆంధ్రప్రదేశ్‌ను నమ్మించి నయవంచన చేసిన బీజేపీని ఎన్నికల్లో ఓడించడం, మన హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా 'ఆంధ్రుల హక్కులు -ఆత్మగౌరవం' కోసం పోరాట యాత్రను కొద్దిరోజుల క్రితం చేపట్టారు. వీజేఎఫ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ దశాబ్దకాలంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను తీవ్రంగా ఖండించారు. విశాఖ ఉక్కును అడ్డగోలుగా అమ్మే కేంద్ర ప్రయత్నాలు దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఉత్తర బీజేపీతో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, బేషరతుగా పొత్తు పెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర విద్యాసంస్థలకు నిధులు రావాల్సి ఉందని, దానిపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. ప్రొఫెసర్ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని వ్యతిరేకించాలని, విశాఖలో పోర్టులు, షిప్‌యార్డ్ కూడా అదానిపరం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి జేఏసీ నాయకుడు ప్రతిపాటి బుల్లిరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ పభుత్వం నిర్వీర్యం చేస్తుందని అన్నారు. ప్రజలను కుల, మత, ప్రాంతీయ వాదంతో విభజించి నీచమైన రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రామిక వికాస సంఘటన జాతీయ ఉపాధ్యక్షుడు యజ్ఞ నారాయణ, సాధన సమితి నేత జీవీఎల్ఎన్ శాస్త్రి, అరవపల్లి శివరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వాణి పూర్వ ప్రధాన సంపాదకులు

మూకల అప్పారావుకు ఘన నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బస్సు ప్రమాదం రూపంలో అకాల మృత్యువాత పడిన ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, ఉపాధ్యాయ వాణి పూర్వ ప్రధాన సంపాదకులు మూకల అప్పారావుకు ఉపాధ్యాయులు, ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఆదివారం రాత్రి మూకల అప్పారావు కన్నుమూశారు. ఆయన మృతదేహాన్ని సందర్శించడానికి బంధుమిత్రులు, ముఖ్యంగా ఉపాధ్యాయ లోకం పోటెత్తింది. ప్రతి ఒక్కరూ తమ ఆత్మీయ సహచరుడికి అంతిమ నివాళులర్పించారు. సోమవారం విజయవాడలోని ఆయన స్వగృహం వద్ద ఉంచిన పార్థీవ దేహానికి ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథ రెడ్డి, పూర్వపు ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, జల్లి విల్సన్, ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు నివాళులర్పించారు. వారితో పాటు ఎమ్మెల్సీలు పి.అశోక్ బాబు, వేపాడ చిరంజీవి, పూర్వపు ఎమ్మెల్సీ రామకృష్ణ, ఎన్నికల్లో పోటీ పడుతున్న వివిధ పార్టీల అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాస్, బోండా ఉమా, దేవినేని అవినాష్, సీహెచ్ బాబూరావు, సోదర సంఘ నేతలు పాండు రంగప్రసాద్, కృష్ణా జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇమ్మానియేల్, చంద్రశేఖర్, మండవ శ్రీను, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వి.భిక్షమయ్య, రాష్ట్ర నాయకులు అరుణ్ కిషోర్, సీనియర్ నాయకులు గౌరీ ప్రసాద్, కొమ్ము ప్రసాద్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన ఎస్టీయూ నాయకులు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. విజయవాడ నగర ఉపాధ్యాయ లోకం అంతా... మూకల అప్పారావు అమర్ రహే... అంటూ నినదించారు. సాయంత్రం 4 గంటలకు అశేష ఉపాధ్యాయ సమూహం సమక్షంలో ప్రారంభమైన అంతిమ యాత్రతో మూకల అప్పారావు మహా ప్రస్థానం ముగిసింది.

ఇటుక రాతి దిగుడు బావిని కాపాడుకోవాలి: శివనాగిరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: చంద్రగిరిలో విజయనగర కాలపు ఇటుక రాతి దిగుడుబావిని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. తిరుపతికి చెందిన సూర్యదేవర హరికృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్వీ భక్తి ఛానల్ బి.వి.రమణతో కలిసి సోమవారం ఆయన ఆ బావిని సందర్శించారు. చంద్రగిరి కోటలో రాజమహల్ ఎదురుగా ప్రైవేటు వ్యక్తులకు చెందిన మామిడి తోటలో ఈ దిగుడు బావి ఉందని, 20 అడుగుల వ్యాసంతో, 20 అడుగుల లోతుతో చుట్టూ ఇటుక రాతి గోడతో దిగటానికి రాతిమెట్లతో నిర్మించబడిందని శివనాగిరెడ్డి చెప్పారు. వృత్తాకారపు ఇటుక రాతి గోడపై, హంపిలోని రాతి దిగుడు బావి వాస్తు శిల్పశైలికి అద్దం పడుతున్న డిజైన్లు, మధ్యలో అలంకరణ పట్టిని అనుకరించి ఈ దిగుడు బావి క్రీస్తుశకం 16వ శతాబ్దికి చెందిందన్నారు. అప్పటి చంద్రగిరి రాజ కుటుంబీకులు తాగునీటి కోసం ఈ బావిని అద్భుతంగా నిర్మించారని చెప్పారు. దిగుడు బావి రాతి కట్టడాన్ని ఇంత నైపుణ్యవంతంగా నిర్మించిన ఆధారం రాయలసీమలో ఇదొక్కటేనని పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో సాగునీటి కోసం వినియోగించినట్లుగా తెలిపే కట్టడాలను బట్టి చెప్పవచ్చు అన్నారు. అరుదైన, అద్భుత ఇటుక రాతి వాస్తు శిల్పశైలి గల ఈ దిగుడు బావిని కాపాడి భవిష్యతరాలకు అందించాలని సూర్యదేవర హరికృష్ణకు, మామిడి తోట యజమానులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లాలో చారిత్రక ప్రాధాన్యత గల బావి అంచుల్ని పునరుద్ధరించి, గోడల్ని శుభ్రపరిచి, భద్రతాపరమైన చర్యలు తీసుకుంటే, చంద్రగిరి రాజమహల్ తో పాటు ఈ దిగుడు బావిని కూడా పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దవచ్చని వారసత్వ ప్రేమికుడు బి.వి రమణ అన్నారు.

భర్త వేధింపులు... ఇద్దరు పిల్లలతో భార్య ఆత్మహత్య

విశాలాంధ్ర-కడప: కుటుంబ కలహాలు ప్రాణం మీదకు తెచ్చాయి. తాగుబోతు భర్తను వదిలించుకునే క్రమంలో అతడి చేతిలోనే దెబ్బలుతిని మనస్తాపానికిగురై కుటుంబ సభ్యులు ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న ఘటన కడప జిల్లా వల్లూరు మండలం గంగాయపల్లిలో జరిగింది. వివరాలివి. ఎద్దుల శ్రీహరితో ఉమామహేశ్వరికి సుమారు 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఫణికుమార్ (18), ధనలక్ష్మి (17) అనే ఇద్దరు పిల్లలు. కుటుంబ పోషణ నిమిత్తం శ్రీహరి ఎనిమిదేళ్లుగా కువైట్‌లో ఉంటున్నాడు. ఇటీవల సొంత ఊరు చేరుకున్న అతడు తాగుడుకు బానిసై భార్యా పిల్లలను వేధిస్తున్నాడు. ఇది తట్టుకోలేని ఉమామహేశ్వరి ఇద్దరు పిల్లలతో కలిసి చెన్నూరులోని తన అన్న కేఆర్ ప్రసాద్ ఇంటికి వచ్చేసింది. ఆమె భర్తపై భరణం కేసు పెట్టింది. కోర్టులో కేసు నడుస్తోంది. వాయిదాలకు వెళ్లి వస్తుండేవారు. ఇలా ఉండగా, లాయర్లు ఓ నిర్ణయానికి వచ్చి భార్యకు ఎనిమిది లక్షల రూపాయలు ఇవ్వాలని ఆదివారం ప్రైవేట్ పంచాయితీలో తీర్మానించారు. ఇదే విషయాన్ని ఆమె భర్త శ్రీహరికి చెప్పారు. అతడు ససేమిరా అన్నాడు. ఏం చేసుకుంటారో చేసుకోండి... నేను జైలుకైనా వెళ్తాకానీ డబ్బులు నా వద్ద లేవంటూ వెనుతిరిగాడు. దీంతో భార్యభర్తల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆవేశానికి గురైన శ్రీహరి భార్య ఉమామహేశ్వరి చెంపపై కొట్టాడు. అవమానం భరించలేకపోయింది. చెన్నూరు చేరుకున్నారు. దేవాలయానికి వెళ్లివస్తానని చెప్పి శనివారం ఉదయం ఇద్దరు పిల్లల్ని తీసుకుని గంగాయపల్లి చేరుకున్నారు. తల్లి, కొడుకు, కుమార్తె ముగ్గురూ వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంపాదకీయం

శిష్య పరమాణువులు

మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత 2014 ఆగస్టు 15న ఎర్రకోట బురుజుల మీంచి మొట్టమొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేస్తూ మోదీ చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకింటే ఆయన చాలా సాత్వికుడు అన్న అనుమానం కలుగుతుంది. "ఏదో ఒక కారణంగా అనేక ఏళ్లుగా మన దేశంలో మత కలహాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ మత కలహాలవల్లే దేశ విభజన జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కూడా కులతత్వం, మతతత్వం అనే విషపూరిత అంశాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ కలహాల్లో అనేక మంది ప్రాణాలు పోయాయి, వీటివల్ల ఎవరికీ ప్రయోజనం కలగలేదు" అని మోదీ అన్నారు. కులతత్వం, మతతత్వం, ప్రాంతీయ తత్వం, సామాజిక, ఆర్థిక వివక్ష లాంటి విషయాలను పదేళ్ల పాటు పక్కన పెడదాం అని కూడా మోదీ సత్యవాక్కు పలికారు. ఆయన అధికారం అంత్యదశకు వస్తున్న తరుణంలో ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగాలు ఈ హితబోధకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఆయన ముస్లింల మీద విషం చిమ్మడం మరింత ఎక్కువైంది. దీనికి ఆయన దగ్గర ఉన్న పెద్ద ఆయుధం అబద్ధాలు ప్రచారం చేయడమే. మోదీ హయాంలో కొనసాగుతున్నది ఆధిపత్య రాజకీయాలే. మోదీ మాటే కొమ్ములు తిరిగిన బీజేపీ నాయకులకు సైతం వేద వాక్కు కిందే లెక్క. బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న అగ్రశ్రేణి ప్రచారకులైన బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అసత్య ప్రచారంలో సంపూర్ణంగా మోదీ అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. మోదీ ప్రచారంలో పెట్టే అబద్ధాలను తు.చ. తప్పకుండా తామూ ప్రచారంలో పెడ్తున్నారు. ఎన్నికల కమిషన్ ఇప్పటిదాకా ప్రధానమంత్రి కొనసాగిస్తున్న అసత్య ప్రచారాన్ని ఉటంకిస్తూ ఆయనకు ఒక్క నోటీసు కూడా జారీ చేయలేదు. కానీ మోదీ నోటి నుంచి వెలువడుతున్న అబద్ధాలు వల్లించినందుకు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జె.పి.నడ్డాకు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. విచిత్రం ఏమిటంటే మోదీని కూడా నిలదీయగల ధైర్యం తమకు ఉందని చెప్పుకోవడానికా అన్నట్టు మోదీకి పంపవలసిన నోటీసు పార్టీ అధ్యక్షుడు నడ్డాకు పంపించింది. నేరుగా మోదీకి నోటీసు జారీచేసే సాహసం మాత్రం ఎన్నికల కమిషన్ చేయలేదు. ఓటమి భయంతో దిక్కు తోచని స్థితిలో ఉన్న మోదీ కాంగ్రెస్‌ను విమర్శించడానికి కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో లేని అంశాలను ఉన్నట్టుగా అసత్య ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల దగ్గర ఉన్న నగ నట్రాతో పాటు మంగళ సూత్రాలు కూడా లాక్కొని ముస్లింలకు ఇచ్చేస్తారని మోదీ విరామంలేకుండా చెప్పిన మాట చెప్పినట్టే చెప్తున్నారు. సంపదను పున: పంపిణీ చేస్తామన్న మాట కాంగ్రెస్ ప్రణాళికలో ఎంత వెతికినా కనిపించదు. అలాగే ముస్లింలకు ఉద్యోగాలు రిజర్వేషన్లు కల్పిస్తామనీ కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో చెప్పనే లేదు. అయినా కాంగ్రెస్ కు అధికారం దక్కితే సచార్ కమిషన్ నివేదికను అమలు చేస్తారని, ముమ్మారు తలాఖ్ విధానాన్ని పునరుద్ధరిస్తారని మోదీ దుష్ప్రచారం చేస్తున్నారు. మోదీ మాట జవదాటలేని స్వభావం ఉన్న అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జె.పి.నడ్డా సరిగ్గా మోదీ మాటలనే పుక్కిటబట్టి పదే పదే ప్రస్తావిస్తున్నారు. సరిగ్గా ఈ అంశం మీదే ఎన్నికల సంఘం ఈ ముగ్గురు అగ్రశ్రేణి ప్రచారకులకు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. యు.పి.ఎ. హయాంలో ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ దేశ వనరుల మీద మొదటి హక్కు ముస్లింలదే అన్నారని అబద్ధాలు చెప్తున్నారు. ఆయన మాటల్లోని సంపూర్ణ వాక్యాన్ని ఉటంకించకుండా అందులో చివరి భాగాన్ని మాత్రమే ఎత్తి చూపి ప్రచారాస్త్రంగా మార్చేశారు. కాంగ్రెస్ కు దొంగచాటు ఎజెండా ఉందని ఎస్.సి., ఎస్.టి., ఒ.బి.సి.లకు ఉన్న రిజర్వేషన్లు లాగేసి వాటిని ముస్లింలకు ఇస్తారన్న మోదీ మాటలనూ అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, నడ్డా త్రయం వల్లిస్తోంది. మోదీకన్నా ముందు పెద్ద నాయకుడైన రాజ్ నాథ్ సింఘ్ కూడా మోదీ గీసిన గీత దాటలేక పోతున్నారు. రాజస్థాన్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ బోలెడు అసత్యాలు మాట్లాడారు. ఈ మాటలు తీవ్ర విమర్శలకు గురయ్యాయి. ముస్లింలను తూలనాడుతూ మోదీ అన్న మాటలకు సౌదీ అరేబియా నర్మగర్భంగా నిరసన తెలియజేసింది. కాంగ్రెస్ కు అధికారం వస్తే ఎస్.సి.,ఎస్.టి., ఒ.బి.సి. రిజర్వేషన్లు గల్లంతు అవుతాయని వాటిని ముస్లిమ్‌లకు కట్టబెడ్తారని గత శుక్రవారం నడ్డా ఎన్నికల ప్రచారం కోసం విడుదల చేసిన వీడియోలో చెప్పారు. మోదీ కీర్తి గానంలో భాగంగా నడ్డా ఒక్క వాక్యం మాత్రం అదనంగా చేర్చారు. నడ్డా కూడా మన్మోహన్ సింగ్ 2006లో, 2009లో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. వనరుల్లో ప్రథమ హక్కు ముస్లింలదే అని బీజేపీ నాయకులు వాదించడం పాప భీతి లేని వాస్తవాల వక్రీకరణ మాత్రమే. ముస్లింలను కాంగ్రెస్ ఎస్.సి.ల జాబితాలో చేర్చి ఎస్.సి.లకు దక్కవలసిన రిజర్వేషన్లలో కోత పెట్టి ఆ ఫలితాలు ముస్లింలకు అందజేస్తారన్నది మరో ప్రేలాపన. ముస్లింలకు కాంగ్రెస్ చేస్తున్న వాగ్దానాలు అమలులోకి వస్తే ఉత్తరాఖండ్ లో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉమ్మడి పౌర స్మృతి లాంటివి కొరగాకుండా పోతాయని అమిత్ షా వాదిస్తున్నారు. ముమ్మారు తలాఖ్ విధానాన్ని రద్దు చేశామని మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది కానీ అందులో ఉన్న లొసుగులకు సమాధానం చెప్పదు. అన్నింటికన్నా మించి ముమ్మారు తలాఖ్ విధానం ఎంత విస్తృతంగా అమలవుతోందన్న గణాంకాలూ బీజేపీ దగ్గర లేవు. కాకి లెక్కల ఆధారంగానే మాట్లాడుతున్నారు. శనివారం ఉత్తర ప్రదేశ్ లోని ఇటావాలో మాట్లాడుతూ యోగీ ఆదిత్యనాథ్ సమాజ్ వాదీ పార్టీ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తుంది అని అంగలార్చారు. అంటే ముస్లింలకు ఏ సదుపాయం ఉన్నా బీజేపీ నాయకులకు కిట్టదనేగా. కలహ కారకాలను పరిహరించి, మతోన్మాదాన్ని విసర్జించి ముందుకు సాగుదాం అని 2014లో మోదీ హితవచనాలు పలికారు గనక గత పదేళ్లుగా ఆయన కొనసాగించిన విద్వేష, విషపూరిత చర్యలకు ఇప్పుడైనా పరిహరిస్తారేమో అనుకుంటే ఆ తీవ్రత మరింత పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు. మోదీ తరవాత కాస్త వలుకుబడి కలిగిన నాయకత్రయం మోదీ పద్ధతిని అనుసరించడమే తమ అస్తిత్వానికి రక్ష రేకు అనుకుంటున్నారు. అలా లేకపోతే తమ అస్తిత్వానికే ముప్పు వస్తుందన్న భయం అమిత్ షాకు లేకపోయినా నడ్డాకు, రాజ్ నాథ్ సింగ్ కు ఉంది. మెరుగైన రాజకీయ ప్రవర్తన వారి లక్ష్యం అని అనుమానించడానికి కూడా వీలు లేదు. మోదీ శిష్యరికంలోనే ఈ ముగ్గురు నాయకులు తమ భవిష్యత్తు ఉందని నమ్ముతున్నారు. మోదీ మతతత్వ రాజకీయంవల్ల ఎక్కువ ప్రమాదం ఉందా ఆధిపత్య ధోరణివల్ల ఎక్కువ ముప్పు ఉందా అని తేల్చి చెప్పడం కష్టమే.

వినదగు నెవ్వరుచెప్పిన

చింతపట్ల సుదర్శన్

ఒకానొక రాజకీయ నాయకుడు ప్రతిపక్ష నాయకుడ్ని గుడ్డలూడదీసి కొడ్తానన్నాడు కానీ సమ్మర్ సూరీడు మాత్రం జనాన్ని బట్టలమీదే బాదుతున్నాడు. ఈ మండే ఎండల మాదిరిగానే వేరు వేరు పార్టీల లీడర్లు ఒకరిమీద ఒకరు గాడిపొయ్యిలో మండేకర్రలు విసురుకుంటున్నారు. ఈ సీజనూ ఆ సీజనూ పెట్రోలూ, గ్యాస్ ధరలు పోటీలు పడుతున్నాయి అనుకుంటూ అరుగు ఎక్కింది డాంకీ తోక చివర నుంచి చెమట చుక్కలు నేల రాలుతుంటే.

సీటు భద్రం భవిత బంగారం అంటుంటారు కదా! అంచేత తన జాగాలోకి వెళ్లి కూచుంది. తర్వాత స్థిమితంగా అరుగు ఈ చివరి నుంచి ఆ చివరి వరకు 'స్కాన్' చేసింది. డాగీ కనపడలేదు. ఈ పాటికి వచ్చి ఉండాలే. అసలే ఎండలు రోడ్డు షోల్లో నాయకుల మాటల్లా పెట్రేగి పోతున్నావని, నాన్ వెజ్ దొరక్కపోతే పోయిందని ఏది లభిస్తే అది గతికి వచ్చేస్తున్నది. మరీ నాడేమైనదో అనుకుంటుంటే కూలిన కొంప లోపలి వైపునుంచి మూలుగు వినిపించింది. అదేదో పార్టీ వాళ్లు ఇంకేదో పార్టీ వాళ్లకు ఖాళీ చెంబూ, కొబ్బరి చిప్పా చూపిస్తున్నారే అదేమైనా పొరపాటున చిప్పలో మూతి ఇరికించుకోలేదుకాదా అనుకుంటూ లేచి లోపలికి తొంగి చూసింది డాంకీ. దాని ఎక్స్‌పెక్టేషన్ సగం కరెక్టయింది. ఆ మూలుగుతున్నది డాగీనే కాని దాని మూతి ఏ కొబ్బరి చిప్పలోనూ ఇరుక్కుపోలేదు. ఏమోయీ వెంకటేషం ఏమిటా

రంగస్థలం

వేషం అని గిరీశం వెంకటేశాన్ని అడిగినట్లు అడిగింది. విషయమేమిటని మూలుగు దేనికని. అక్కడ నిలబడి నిలదీయకు కాస్త లోపలకి వచ్చెయ్యి. ఎవరైనా చూస్తే బాగోదు అంది డాంకీ లేపడానికి శక్తిలేక తోకని కిందికి జార్చేస్తూ అంది డాగీ. పార్కులో లవర్స్ మాట్లాడుకుంటుంటే విని నేర్చుకున్నావా! అంది. ష్షుష్షుష్షు...పెద్దగా అరవకు. నాయు భయంగా ఉంది అంది డాగీ వెన్నుని వణికిస్తూ. ఇదేదో సీరియస్సే అనుకుని అసలేమైంది 'బ్రో' అని అడిగింది డాంకీ. ఏం చెప్పను? చలం గారి కథ 'ఖర్మ మిట్లాకాలింది' లా నా ఖర్మమూ తగలడింది. ఓ వైపు రోడ్డు చురుక్కుమంటుంటే మరోవైపు రోడ్డుషోల హెూరు. మనుషులు నిలబడడానికి జాగాలేని రోడ్లంట నాలాంటి కుక్కలూ నీలాంటి గాడిదలూ నడవలేవు మరి. ఎరక్కపోయి ఇరుక్కు పోయాను. ఓ రోడ్డుషోలా, దూరాన్నించి మైకులో మాటలు వినపడ్డాయికాని ఆ మాట్లాడే దెవరో కనిపించలేదు. ఆ తొక్కిసలాడే జనం మధ్య నుంచి మన రోడ్డువైపు రావడానికి నానాతంటాలు పడుతూంటే ఎవడో జండాకర్ర పుచ్చుకు కొట్టాడు. బెదిరిపోయాను... ఎటునుంచి ఎటుపోవాలో అర్థంకాక 'ఆ అయోమయావస్థలో ఓ కార్యకర్త పిక్కపట్టుకోక తప్పలేదు. దారిలో జనం రెచ్చిపోయి నా వెంట పడ్డారు. వాళ్లకు టోకరా ఇచ్చి ఇంట్లోకి వచ్చి దాక్కున్నా కానీ వాళ్లే క్షణమైనా రావచ్చునని భయంగా ఉంది. నీ ఈ కుక్క జన్మకి విముక్తి ప్రసాదిస్తారేమో! అంది డాగీ. నువ్వు కరిచింది ఏ పార్టీ వాడ్ని! ఏలినవారి పార్టీ వాడ్నయితే నీ మీద హత్యానేరం మోపబడుతుంది సుమా. ఏ పార్టీ వాడని చెప్పను. నేనున్న పరిస్థితుల్లో చూడగలిగే ననుకుంటున్నావా? అయితే మైకులోంచి మాటలు వినపడి ఉండాలి కదా. ఆ మాటల్నిబట్టి డిసైడ్ చేయవచ్చు. ఏం విన్నావో గుర్తు చేసుకో అంది డాంకీ. గుర్తు చేసుకోవడానికి తలని గోడకి బాదుకోసాగింది డాగీ. బాగా గుర్తుచేసుకో నే చెప్తావిని అవునోకాదో అనన్నా చెప్పు అంది డాంకీ, తలబాదుకోవడం ఆపింది డాగీ. నా కోసం నలభైమంది ఎర్రచందనం స్మగ్లర్లని దింపారట అని కానీ, నమ్మి గెలిపిస్తేనట్టేట ముంచారు అని కానీ విన్నావా! గుర్తు రాలేదు డాగీకి. కడప నుండి రౌడీలు వస్తున్నారన్నమాట కానీ ఫలానా వారికి ఓటు గనకవేస్తే పులి నోట్లో తలపెట్టినట్టే అని కానీ దేశంలో దొంగలు పడ్డారు అన్న మాట కానీ వినపడిందా అంది డాంకీ. డాగీ గుర్తుచేసుకోడానికి ప్రయత్నించసాగింది. ఇంటి బైట ఉండాల్సిన సైకిలు, ఇంట్లో ఉండాల్సింది ఫ్యాను, సింకులో పడెయ్యాల్సింది గ్లాసు. ఆగాగు...గుర్తుకొస్తున్నది అంది డాంకీ. తొమ్మిది హామీలని పెన్షన్‌పెంపు, చేయూత రెట్టింపు, తల్లి ఒడి పెంపు, రైతు భరోసా, నేస్తం, సున్నా వడ్డీ, షాదీ తోఫా, వాహనదోస్తు దీవెన, అక్కచెల్లెమ్మలకు ఇళ్లు, లక్షల ఉద్యోగాలు, పరిశ్రమలు, రోడ్ల మరమ్మత్తులు ముచ్చటగా మూడు రాజధానుల అభివృద్ధి లాంటి మాటలు విన్నావా? అవునవును కరెక్టు కరెక్టు అవే మాటలు అంది డాగీ. అయితే చచ్చావన్నమాటే. ఇదంతా సర్కారువారి పాట నవరత్నాల మూట. ఇక నిన్నాపైవాడే కాపాడాలి అని డాంకీ అంటుంటే అరుగు ఎక్కాడు అబ్బాయి. నవరత్నాలంటున్నారు ఏమిటీ విషయం అంటూ అదే 'తంబీ' పాత నవరత్నాలకే మెరుగు పెడ్తున్నారన్నారుకదా. వాటి గురించే అంటున్నాఅంది డాంకీ. వాళ్లు నవరత్నాలంటే వీళ్లు నవ మోసాలు అంటున్నారులే. ఇంతకీ పైవాడే కాపాడలంటున్నావు ఎవర్ని? ఇంకెవరిని, మన డాగీని. రోడ్డు షోలో ఓ కార్యకర్త పిక్క కొరికిందట. గులకరాయి పడితేనే హత్యాప్రయత్నం అన్నవారు దీన్ని వదుల్తారంటావా? అంది డాంకీ.

ఓస్ అంతేనా? నో వర్రీస్! డాంకీ. బీరుకీ, బిర్యానీకీ వచ్చే కార్యకర్తలు అన్ని రోడ్డు షోల్లోనూ రిపీటవుతుంటారు. అది వాళ్ల పొట్ట తిప్పలు. ఇవాళ వచ్చినోడు రేపు రాడు. నువ్వేం భయపడకు. కుక్కల్ని పోలిన కుక్కలు అనేకం. గుర్తు పట్టరులే అన్నాడు అబ్బాయి. మనిషినయి ఉంటే బాగుండేది. అన్ని మీటింగులకూ వెళ్లి కావల్సినంత తిని, ఎవరేది చెప్పినా విని చక్కా వచ్చేదాన్ని అనుకుంది డాగీ.

సార్వత్రిక ఎన్నికలపై దేశ భవిత

అమర్‌జీత్ కౌర్
ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

18వ లోక్‌సభ ఎన్నికలు 2024లోజరుగుతున్నాయి. మే 1న ఇదే సమయంలో మేడేను దేశవ్యాప్తంగా జరుపుకోనున్నాము. గొప్ప మిశ్రమ సంస్కృతి, నాగరికతలను ఈ ఎన్నికలు నిర్ణయించనున్నాయి. ఆర్ఎస్ఎస్-బీజేపీ విధ్వంసకర పాలనకు ఓటర్లు స్వస్తి పలకాలని కోరుతున్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన ప్రజాస్వామ్యాన్ని, కీలకమైన విలువలను, అసంతృప్తి వ్యక్తంచేసే హక్కును, భావప్రకటనా స్వేచ్ఛను, మత విశ్వాసాలను, భాషలను, సంస్కృతులను, ఆహార నియమాలను గౌరవించడం, ఇష్టమైన బట్టలు ధరించే హక్కును కాపాడుకోవాలి.

బీజేపీ నాయకుడు నరేంద్ర మోదీ గత పదేళ్లలో దుష్పరిపాలనలో సామాన్య ప్రజలు ఏనాడు బాధలు అనుభవించారు? ఈ ఏడాది 29శాతం నిరుద్యోగం పెరిగింది. ఉద్యోగాలు లభించకపోవడం సర్వసాధారణమైంది. 30శాతం స్టార్టప్‌లు మూతపడటంలో ఈ పరిస్థితి తలెత్తింది. 2022లో 121స్టార్టప్‌లు లే ఆఫ్‌లు అయ్యాయి. దీంతో 34,785 మంది ఉద్యోగాలు కోల్పోయారు. 2023లో 69 కంపెనీలు లే ఆఫ్‌చేసి 15247 మందిని నిరుద్యోగులుగా చేశారు. రానున్న దశాబ్దిలో కనీసం ఏడు కోట్ల ఉద్యోగాలు అవసరమవుతాయని షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ అంచనావేసింది. పెద్దనోట్లరద్దు వల్ల 30శాతం ఎంఎస్ఎంఇలు మూతపడ్డాయి. ఇంతవరకు అవి మళ్లీ ప్రారంభం కాలేదు. జీఎస్టీ చిన్న పరిశ్రమలకు ఆటంకమైంది. ఐటి సంస్థలు ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో సంస్థలు 40శాతం ఉద్యోగులను తొలగించినట్లు అధ్యయనం తెలిపింది. కొత్త ఉద్యోగాలు కల్పించలేదు. వేతనాల సంక్షోభం ఏర్పడింది. ఈ వాస్తవాలన్నీ ప్రజలకు తెలియకుండా ప్రభుత్వం దాచేస్తుందని లేబర్ బ్యూరో గణాంకాలు, ఎన్ఎస్ఎస్ఓ గణాంకాలు తెలియజేస్తున్నాయి. సంక్షేమ పథకాలకు భారీ నిధులు ఖర్చు చేసినట్టు చెప్తున్న గణాంకాలలో అత్యధికంగా అవకతవకలున్నట్లుగా 'కాగ్' వెల్లడించింది. ఇందుకు సంబంధించిన నివేదికల ముద్రణ నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ, లేదా మొత్తంగా అమ్మివేయడం జరుగుతోంది. దేశప్రయోజనాలను ఫణంగా పెట్టి ఎంపికచేసిన కార్పొరేట్‌లకు, స్వదేశీ, విదేశీబ్రాండ్లు బడావ్యాపార సంస్థలను స్వాధీనం చేసుకుంటున్నాయి. పీఎం కేర్స్‌కు నిధులకు, ప్రభుత్వరంగ పరిశ్రమల నుంచి 50శాతానికి పైగా వచ్చాయి. ఈ నిధుల విషయంలో ఎలాంటి పారదర్శకత లేదు. ఈ నిధులను గురించి పార్లమెంటుకుసైతం మోదీ చెప్పలేదు. ఈ నిధులు ఎలా ఖర్చు చేస్తుందో తెలియదు. ఇదొక పెద్ద కుంభకోణం. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని, చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయినప్పటికీ తాము గెలిస్తే మళ్లీ ఈ పథకాన్ని ప్రవేశపెడతామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మోదీ సైతం పరోక్షంగా ఈ అవినీతిని సమర్థిస్తున్నారు. దీని ద్వారా రాజ్యాంగాన్ని గౌరవించడం లేదని స్పష్టమైంది. ఈడీ, సీబీఐ తదితర దర్యాప్తు సంస్థలకు భయపడిన పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల యజమానులు తమ వద్ద గల నల్లధనంతో ఎన్నికల బాండ్ల కొనుగోలు చేస్తూ నల్లధనానికి రక్షణ పొందడమేగాక, ప్రభుత్వం నుంచి తమకు కావలసిన ప్రయోజనాలు పొందుతున్నారు. ఇలాంటి దుర్మార్గమైన పద్ధతిని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టులో బీజేపీ వారు పిటిషన్ దాఖలు చేశారు. ఉత్తరాఖండ్‌లో కార్మికులు భద్రతాచర్యలు చేపట్టని సిల్క్యార టన్నల్ నిర్మాణ యాజమాన్యం ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసింది. టన్నెల్ నిర్మాణదశలో జరిగిన ప్రమాదంలో తీవ్ర నష్టం జరిగినా ప్రభుత్వ ఏ చర్య తీసుకోలేదు. కల్తీమందులు తయారుచేసి అమ్మిన కంపెనీలపై, ప్రత్యేకంగా కరోనా మహమ్మారి విస్తరించి లక్షలమంది ప్రాణాలు వదలిన సమయంలోనూ మోదీ ప్రభుత్వం కల్తీమందులు తయారుచేసిన కంపెనీలపై చర్యలు తీసుకోలేదు. ఈ కంపెనీలు ఎన్నికల బాండ్లు కొనుగోలుతో ఆ కంపెనీలపై ఎలాంటి చర్యలులేవు. కల్తీ మందులు తయారుచేసిన కంపెనీల బండారం బైటపడినా ప్రభుత్వం మౌనంగా ఉంది.

ప్రధాని జన ఆరోగ్య యోజన పథకం కింద 7.6లక్షల మంది పేర్లు నమోదయ్యాక వీరి కోసం నిధులు విడుదలయ్యాయి. అయితే వీరిలో 3446 మంది అప్పటికి మృతిచెందిన వారికి కూడా నిధులు విడుదల చేశారు. అదానీ, అంబానీ తదితర కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను పీఎంఓ తీసుకుంది. అదానీ కంపెనీలలో 56142 కోట్లు పెట్టుబడులు పెట్టాలని ఎల్ఐసీపై వత్తిడి చేశారు. ప్రైవేటు కంపెనీలకు ప్రయోజనం కలగడానికి వీలుగా ప్రభుత్వ కంపెనీలను పీల్చిపిప్పి చేశారు. మనకార్మికుల కోసం విడుదలైన రు.165,000కోట్ల సామాజిక భద్రతా నిధులను అదానీకి అప్పనంగా అప్పగించారు. మోదీ, అద్వానీని తన వెంట ఆస్ట్రేలియాకు తీసుకువెళ్లి బొగ్గుగనుల కాంట్రాక్టు ఇప్పించడమేగాక, మన ఎస్‌బీఐలో రు.8వేల కోట్లు అప్పు ఇప్పించారు. బహుశా ఈ డబ్బుకూడా రద్దుచేసిన ఖాతాల్లో ఉండి ఉండవచ్చు. ప్రభుత్వరంగ హెచ్ఏఎల్ కంపెనీకి దక్కకుండా దసాల్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీ కాంట్రాక్టును ఏ అనుభవంలేని అంబానీకి ఇప్పించారు. ఇలాంటి 'ముద్దు మిత్రులకు' లెక్కలేనన్ని ప్రయోజనాలను కల్పించారు.

బొగ్గుగనుల కాంట్రాక్టులను అదానీకి ఇవ్వడానికి గాను మూడుసార్లు చట్టాలనే మోదీ మార్చారు. దీనిద్వారా అదానీకి రు.830కోట్ల ప్రయోజనం కలిగింది. అదానీకి, అంబానీలకు ప్రయోజనం కల్పించి బొగ్గుగనుల రంగంలో ఉన్నఅన్ని ప్రభుత్వ కంపెనీలను మోదీ ప్రభుత్వం దారుణంగా నాశనం చేసింది. పోర్టులు, రైల్వే ఫ్లాట్‌ఫారంలు ప్రైవేటు కంపెనీలకు అప్పగించారు. ప్రైవేటు రైళ్లను పెంచి సామాన్య జనానికి అందుబాటులో ఉన్న టిక్కెట్ల ధరలను అమాంతంగా పెంచారు. ప్రభుత్వ రక్షణరంగం కార్పొరేషన్లు, ఫ్యాక్టరీలు, చమురురంగం, విద్యుత్ రంగాల్ని ప్రైవేటీకరించేందుకు అన్ని చర్యలు సిద్ధం చేశారు. విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ, మతీకరణ (మోదీకి) ఇష్టమైన మతానికి చెందినవారు చేసి విద్యను ప్రైవేటీకరణ చేశారు. ప్రభుత్వరంగం వైద్యం, ఆరోగ్యాన్ని బలహీన పరిచారు. ఫలితగా ప్రైవేటు కార్పొరేట్లకు అపారలాభాలు దక్కాయి. అత్యవసరమైన నీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు సామాన్యులకు లభ్యకావడంలేదు. అన్నిరకాల నేరాలు, మోసాల నుంచి తన 'ఆప్తమిత్రుడు' అదానీని కాపాడేందుకువీలుగా పార్లమెంటులోనూ చర్చ జరగకుండా మోదీ చర్యలు తీసుకున్నారు. ప్రత్యర్థులను హింసించడానికి, ఎన్నికల్లో గెలవడానికి రాజ్యాంగ హక్కులు గల దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ, యూఏపీఏ, ఎన్ఎస్ఏ, ఎన్ఐలు తదితర దర్యాప్తులను విచ్చలవిడిగా వినియోగించుకున్నారు. ప్రయోజనాలన్నీ బీజేపీకే దక్కాయి. మోదీ ప్రభుత్వంలో ఆర్థిక, సామాజిక అంతరాలు అమాంతం పెరిగాయి.

కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ట్రేడ్ యూనియన్లకు చెందిన కార్మికులు దేశవ్యాప్తంగా సమ్మెలు, నిరసనాందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కార్మికులకు అనుకూలమైన చట్టాలస్థానే నాలుగు కోడ్‌లను యాజమాన్యాలకు అనుకూలంగా రూపొందించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని వారికి తప్పుడు వాగ్దానం చేశారు. మూడు దుష్ట సాగు చట్టాలను తీసుకువచ్చి రైతుల మహత్తర పోరాటానికి వెనుకాడి మళ్లీ ఆ చట్టాలను ఉపసంహరించుకున్నారు. దేశంలో మహిళల పరిస్థితిపైన బీజేపీ అనుసరిస్తున్న వైఖరి అత్యంత దారుణంగా ఉన్నది. మణిపూర్ మంటలు ఇంకా చల్లారలేదు. బిల్కిస్ బానో కేసులో జైలులో ఉన్నదోషులను వదిలిపెట్టి అత్యంత దుర్మార్గంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. మహిళా రెజ్లర్లపై అత్యాచారాలకు పాల్పడినట్లు బీజేపీ ఎంపీపై ప్రభుత్వానికి ఫిర్యాదుచేసినా, ఆందోళన చేపట్టినా మోదీ ప్రభుత్వం బాధితులను హింసించి దోషిని వదిలేశారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, మహిళా సాధికారిత, నైపుణ్యశిక్షణ ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ స్నేహితులకు అప్పగించడం విషయంలోనూ మోదీ తప్పుడు మార్గాలను అనుసరించారు. సమాఖ్యవ్యవస్థను పూర్తిగా విస్మరించాడు. మోదీ పరిపాలన సమైక్యతకు ముప్పుగా పరిణమించింది. వివిధమతాలు, భాషలు, సంస్కృతి గల బహుళ సామాజిక వ్యవస్థను నాశనం చేస్తున్నారు. ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ వారిపై మోదీ విషం గక్కుతున్నారు. వారు చొరబాటుదారులని, అధికంగా పిల్లలను కంటారని మాట్లాడుతున్నారు. సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని చివరినిమిషంలో నామినేషన్ ఉపసంహరింపచేసి బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటింపచేసుకున్నారు. ఇలాంటి కుట్ర చండీఘడ్ మేయర్ ఎన్నికల్లోనూ నిర్వహించినట్లు సుప్రీంకోర్టు విచారణ ద్వారా బట్టబయలైంది. బీజేపీ ప్రభుత్వం హిట్లర్ అడుగుజాడల్లో నడుస్తున్నదని బహిరంగంగానే స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో కార్మికవర్గం మోదీ ప్రభుత్వాన్ని ఓడించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి. ప్రజలంతా సామరస్యంతో జీవించడానికి వారికి స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కులు పరిరక్షించేందుకు లౌకిక ప్రజాస్వామ్య దేశంగా కొనసాగించేందుకు మోదీ ప్రభుత్వాన్ని కచ్చితంగా ఓడించాలి. 2024 మే డే సందర్భంగా బీజేపీని ఓడించి ప్రజలను, దేశాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయాలి.

(మే దినోత్సవం సందర్భంగా)

సంపద పంపిణీపై 'మోదీ' వక్రభాష్యం

ఎం.సి.వెంకటేశ్వర్లు

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోపై మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన సాగిస్తానని రాజ్యాంగంపై ప్రమాణంచేసి రెండుసార్లు ప్రధాని పదవిచేపట్టిన నరేంద్ర మోదీ ముస్లింలపై ద్వేషాన్ని కక్కాడు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల కాలంలో ఏ ప్రధానమంత్రి తన స్థాయిని దిగజార్చి ఇంత చౌకబారు ప్రచారానికి పూనుకోలేదు. లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నాయి. "కిచిడీ పార్టీలని" "తుకడే, తకడే గ్యాంగ్" అని హేళనకు గురైన పార్టీలు కాంగ్రెస్ నాయకత్వాన "ఇండియా" కూటమిగా ఏర్పడి ఎన్నికల రంగంలోకి దిగడంతో కాషాయదళానికి వెన్నులో వణుకుపుట్టింది. జూన్4న ఓటర్ల తీర్పు ఎలా ఉన్నా ఎన్‌డీఏ కూటమికి 400సీట్లు (370+) సాధించి ఒక నాటి రాజీవ్‌గాంధి మార్కును అధిగమిస్తామని కలలు గన్న కాషాయదళానికి, ప్రత్యేకంగా మోదీ, అమిత్‌షాలు కోరిక నెరవేరే పరిస్థితి కనిపించకపోవడంతో కాంగ్రెస్ మానిఫెస్టోపై వక్రభాష్యానికి అసంబద్ధ వాదనలకు పూనుకున్నారు.

'బాన్స్‌వాడా' (రాజస్తాన్)ఎన్నికల సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'సంపద మొత్తాన్ని సర్వేచేసి పున:పంపిణీ చేస్తామని" కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టో చెప్పిందని, మహిళల మంగళసూత్రాలతో సహా సంపదనంతా దోచి చొరబాటు దారులకు, ఎక్కువ మంది పిల్లలున్నవారికి (ముస్లింల నుద్దేశించి) దోచి పెడతారని, దానికి అనుగుణంగా చట్టాలను మారుస్తారని కాంగ్రెస్, ఇండియా కూటమిపై విరుచుకు పడ్డారు. అంతటితో ఆగక, ఇది మావోయిస్టు-కమ్యూనిస్టు భావజాలమని, ఇలాంటివాళ్లు చాలా దేశాలను నాశనం చేశారని తనలో ఉన్న కమ్యూనిస్టు వ్యతిరేక ద్వేషాన్ని మోదీ చాటుకున్నాడు. ఆర్‌ఎస్ఎస్, జనసంఘ్, బాలక్ గురుగోల్వాల్కర్ ఈ దేశానికి ముగ్గురు శత్రువులు. "ఒకరు ముస్లింలు, రెండు క్రైస్తవులు, మూడు కమ్యూనిస్టులు' అని చెప్పిన విషయాన్ని అన్యాపదేశంగానైనా మోదీ బహిర్గతం చేశారు.

ఆర్ఎస్ఎస్ అజెండా రాజ్యాంగాన్ని మార్చడం, సెక్యులరిజం, సోషలిజం పదాలను తొలగించడం, మైనారిటీవర్గాల ప్రత్యేక హక్కులు రద్దు చేయడం, జమిలి ఎన్నికలు జరిపించడం ఉన్నఆయి. ఇవి జరగాలంటే పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. రాష్ట్రాల తోడ్పాటు కావాలి. ఎన్‌డీఏ కూటమికి ప్రస్తుతం ఉన్న సంఖ్యాబలం తగ్గిపోయినా ఆర్ఎస్ఎస్ అజెండా అర్థంతరంగా నిలిచిపోతుందన్న భయం మోదీ పాలకులకు పట్టుకున్నది.

దేశంలోఉన్న హిందువులు కాషాయదళం లెక్కప్రకారం 85శాతం వరకుఉన్నారు. వారిలో ఎస్‌సీలు 18శాతం, ఎస్‌టీలు 8శాతం, బీసీలు దాదాపు 40శాతం. వీరిలో సుమారు 10శాతంతప్ప మిగిలిన వారంతా పేద, కడుపేదవారు. అగ్రవర్ణాలలో కూడా అత్యధికలు కూలి, నాలి చేసుకు బ్రతికేవారే. అంటే దేశజనాభాలో ముస్లింలను మినహాయిస్తే (వారూ పేదవారే) షుమారు 144కోట్ల మంది ప్రజల్లో 100 కోట్లకుపైగా పేద, కడుపేద, దిగవ మధ్యతరగతి వారే. లక్షల కోట్లకు పడగలెత్తినవారు వందల్లో ఉన్నారు. వేలకోట్లున్నవారు వేలల్లో ఉన్నారు. నిజంగా రాహుల్ గాంధీ అధికారంలోకివస్తే సర్వే చేసి ఎవరి దగ్గర పోగుపడిన సంపద ఎవరికి దోచి పెడతాడు? దేశ ప్రజల సంపదను ముస్లింలకు పంచుతాడని మోదీ అంటే ఎంతమంది నమ్ముతారు. 50 సంవత్సరాలు అధికారంలో ఉండి పెద్దల సంపదను ఎంతమందికి పంచింది కాంగ్రెస్? ఎన్నికలలో విమర్శలు చేసుకోవడం సహజం. కాని హద్దు దాటకూడదు. మోదీ తనకుతానే సర్వాంతర్యామినని, రామరాజ్యం స్థాపించడానికి ఆ రాముడు పంపిన దూతనని తనకు తానే భ్రమపడుతుంటాడు. సముద్ర గర్భంలోకి వెళ్లి 'ద్వారకానగరం' (శ్రీ కృష్ణుని జన్మస్థానం) చూసి తన్మయత్వం చెందినట్లు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈ దేవదూతకు తన పాలనలో పెరుగుతున్న నిరుద్యోగం మాత్రం కనపడదు, రైతుల ఆత్మహత్యలు కనిపించవు, ప్రతిరోజు అత్యాచారానికి గురవుతున్న మహిళలు, ముస్లిం మైనారిటీల ఆర్తనాదాలు వినిపించవు. సంవత్సరకాలంగా తగలబడుతున్న మణిపూర్ గురించి మాట్లాడడు. ఆయనకు తెలిసిందల్లా ప్రతిపక్ష పార్టీలను, నాయకుల నోరునొక్కి, జైళ్లలో కుక్కి అధికారపీఠం సాధించడాదనికి కుయుక్తులు పన్నడం. అయితే ఈ సందర్భంగా ఒక విషయంలో మోదీని అభినందించాలి. "దేశ సంపదను పున:పంపిణీ' అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశం చేయడం, ఇది మావోయిస్టులు, కమ్యూనిస్టుల ఆలోచనఅని వాస్తవం చెప్పడం. కులగణనచేసి పేద ప్రజలను గుర్తించి దేశసంపదను ప్రజలందరకు పంపిణీ చేస్తామన్న అభిప్రాయాన్ని కాంగ్రెస్ మానిఫెస్టో చెప్పి ఉండవచ్చు. దేశసంపదను ఏ కొద్దిమందో స్వాహాచేయడం కాకుండా, ఆ సంపదను సృష్టించిన 80శాతం ఉన్న పేదలందరకు దక్కాలని, సామాజిక న్యాయమంటే అదేనని కమ్యూనిస్టులు ఏనాటినుండో చెప్పే మాటలు ఈ విషయాన్ని కమ్యూనిస్టులేకాదు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవేత్తలు చెబుతున్నమాట. మరోపక్క ప్రపంచంలో అత్యధికంగా యువకులున్న మన దేశంలో 2022-23లో షుమారు 6శాతం ఉన్నారు. దేశజనాభాలో 14.5శాతం పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. 71శాతం మందికి సమతుల ఆహారంలేదు. తిండిలేక బాధపడుతున్నవారు ప్రపంచ జనాభాలో 25శాతం మంది భారతదేశంలోనే ఉన్నారు. ఆకలిసూచీలో 111వ స్థానం, మానవాభివృద్ధి సూచీలో 193దేశాలలో 134వ స్థానంలోఉన్నట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. దేశంలో సంపద కేంద్రీకరణ, మరోపక్క ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగం, మహిళలపై ప్రత్యేకించి దళిత మహిళలపై అత్యాచారాలు, దళితులు, దళిత క్రిస్టియన్‌లు, ముస్లిం మైనారిటీలపై దాడులు, హత్యలు పెరుగుతున్నా తనకేదీ పట్టదని నిమ్మకు నీరెత్తినట్లు ఉండే మోదీ ఒక్కసారిగ దేశ సంపదను, మహిళల మంగళసూత్రాలను ముస్లింలకు దోచి పెడుతున్నారని కాంగ్రెస్‌పై దుష్ప్రచారానికి పూనుకున్నాడు. దేశంలో ముస్లింలో ద్వేషాన్ని రెచ్చగొట్టి తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నాడు. ఇది తాత్కాలికంగా లాభం చేకూర్చవచ్చునేమోకాని దేశ సంపద కేంద్రీకరణ, పున:పంపిణీ ప్రజాందోళననలు రాక తప్పదు. ఈ సందర్భంగా బాబా సాహెబ్ అంబేద్కర్ "ప్రజలకు సార్వత్రిక ఓటు హక్కు కలిగించి రాజకీయహక్కును ఇచ్చాం, మంచి రాజ్యాంగాన్ని రచించుకున్నా, ఆర్థికపరమైన సమానత్వాన్ని కలిగించకపోతే ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని " హెచ్చరించాడు.

సెల్ : 8121223457

ఎన్నికల రాజకీయాలకు ప్రియాంక సై

రాయబరేలి నుంచి పోటీకి సన్నాహాలు

24 మందితో ప్రత్యేక బృందం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి లోక్‌సభ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ... ఇందుకోసం సర్వశక్తులు ఒడ్డేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను రాయబరేలి నుంచి తొలిసారి ఎన్నికల బరిలోకి దింపేందుకు ముందస్తుగా భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఎలక్షన్ మేనేజిమెంట్ కోసం 'స్పెషల్ 24' టీమ్‌ను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం 24 మంది సభ్యుల ఈ కమిటీలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పార్టీ ప్రతినిధులు ఉంటారు. ఇందులో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులకు చోటు కల్పించారు. అదనంగా ఐదుగురు కాంగ్రెస్ ప్రముఖులతో ఒక బ్యాకప్ టీమ్ కూడా ఉంటుంది. రాయబరేలిలో ఎన్నికల అంచనాల కోసం ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలుతో పాటు ఐటీ వార్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రాయబరేలి ఎన్నికల కోసం సోనియాగాంధీ ఏర్పాటు చేసిన 'స్పెషల్-24' సమన్వయ కమిటీలో ఆమెతో పాటు ఆమె ప్రతినిధులుగా కేఎల్ శర్మ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంకజ్ తివారీ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ధీరజ్ శ్రీవాస్తవ, రాయబేరేలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సుశీల్ పసి, హర్జాండ్‌పూర్ మాజీ ఎమ్మెల్యే సురేంద్ర విక్రమ్ సింగ్, డాక్టర్ మనీశ్ సింగ్ చౌహాన్, సెరెనె అసెంబ్లీ అభ్యర్థి సుధా ద్వివేది, ఊంచహార్ అభ్యర్థి అతుల్ సింగ్, రాయబరేలి నగర్ పాలిక చైర్మన్ శత్రోహన్ సోంకర్, లాల్‌గంజ్ నగర పంచాయతీ చైర్మన్ సరితా గుప్తా, మాజీ నగర పాలిక చైర్మన్ ఎం.ఇలియాస్, ఏఐసీసీ మాజీ సభ్యుడు కల్యాణ్ సింగ్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేత వీకే శుక్లా ఉన్నారు.

కాగా, పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్, ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జి అవినాష్ పాండే, ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి ఆరాధనా మిశ్రా ఎన్నికల ప్రధాన వ్యూహకర్తలుగా వ్యవహరిస్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహకర్తల్లో ఒకరుగా ఉంటూ పార్టీకి ఇటీవల గణనీయమైన విజయాలు సాధించి పెట్టిన సునీల్ కనుగోలు సైతం రాయబరేలి ఎన్నికల్లో మరోసారి వ్యూహకర్తగా తన సత్తా చాటుకోనున్నారు. ప్రియాంక గాంధీ అభ్యర్థిత్వంపై ఆసక్తి పెరుగుతున్నట్టు ఆయన జరిపిన ప్రాథమిక సర్వేలో తేలినట్టు చెబుతున్నారు. భారత్ జోడో యాత్ర సమయంలోనూ కనుగోలు టీమ్ సర్వే జరిపింది. ఉత్తరప్రదేశ్‌లోని 80 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో రాయబరేలి నియోజకవర్గం కాంగ్రెస్‌కు పెట్టని కోటగా నిలుస్తూ వచ్చింది. రాయబరేలిలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన సోనియాగాంధీ ఈ ఏడాది రాజ్యసభకు ఎన్నికయ్యారు. సోనియాగాంధీకి ముందు రాయబరేలి నియోజకవర్గానికి ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించారు. 2004 నుంచి సోనియాగాంధీ ఇక్కడ ఓటమి ఎరుగని నేతగా నిలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ నుంచి గెలిచిన ఏకైక ఎంపీ సోనియాగాంధీనే.

బెంగాల్ టీచర్ల నియామక కుంభకోణం

సీబీఐ దర్యాప్తుపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ : ఉపాధ్యాయుల నియామక కుంభకోణంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అధికారుల పాత్రపై దర్యాప్తునకు సీబీఐని ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీం కోర్టు సోమవారం స్టే విధించింది. ప్రభుత్వ, రాష్ట్ర-ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) చేసిన 25,753 మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నియామకం చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. దీనిపై మే 6న విచారణ జరుపుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'రాష్ట్ర ప్రభుత్వంలోని అధికారులపై తదుపరి దర్యాప్తును సీబీఐ చేపడుతుందని జారీ అయిన ఆదేశాలపై మేం స్టే విధించాం' అని ధర్మాసనం పేర్కొంది. అక్రమ నియామకాలకు అనువుగా సూపర్ న్యూమరీ పోస్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన వ్యక్తులకు సంబంధించి సీబీఐ తదుపరి విచారణ చేపడుతుందని కలకత్తా హైకోర్టు పేర్కొంది. అవసరమైతే, అటువంటి వ్యక్తులను సీబీఐ కస్టడీలో విచారించనుందని పేర్కొంది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం, అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన అప్పీల్‌లో, హైకోర్టు 'ఏకపక్షంగా' నియామకాలను రద్దు చేసిందని పేర్కొంది. 'అత్యవసరమైన పరిస్థితిని ఎదుర్కోవడానికి పిటిషనర్ రాష్ట్రానికి తగిన సమయం ఇవ్వకుండా, బోధన, బోధనేతర సిబ్బందిని తక్షణమే సర్వీసు నుంచి వెంటనే తొలగించడానికి దారితీసిన మొత్తం ఎంపిక ప్రక్రియను రద్దు చేయడంలో హైకోర్టు విఫలమైంది. విద్యావ్యవస్థ స్తంభించిపోయింది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

బీజేపీ ఎంపీ శ్రీనివాస ప్రసాద్ కన్నుమూత

బెంగళూరు: కర్నాటక బీజేపీలో విషాదం చోటుచేసుకుంది. చామరాజనగర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ పార్టీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస ప్రసాద్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవలే బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుది శ్వాసవిడిచారు. ఆయన వయసు 76 ఏళ్లు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా, చామరాజనగర్ నియోజకవర్గం నుంచి శ్రీనివాస ప్రసాద్ ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. మైసూరు జిల్లాలోని నంజన్‌గుడ్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవలే తన 50 ఏళ్ల రాజకీయ జీవితం నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటన చేశారు. శ్రీనివాస ప్రసాద్ మరణ వార్త తెలుసుకున్న పార్టీ పెద్దలు, రాజకీయ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

1976లో బీజేపీలో చేరిన ఆయన... 1979లో కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. బీజేపీలో చేరడానికి ముందు కొంతకాలం జేడీయూ, జేడీఎస్, సమతా పార్టీల్లో కూడా పనిచేశారు. 1999-2004 మధ్య అతల్ బిహారీ వాజ్‌పేయి కేబినెట్‌లో శ్రీనివాస ప్రసాద్ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి 2013లో ఎమ్మెల్యేగా గెలిచారు. మళ్లీ 2016లో కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. అనంతరం తిరిగి బీజేపీలో చేరారు. ఆ తర్వాతి ఏడాది 2017లో నంజన్‌గుడ్ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేశారు. అయితే, ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. అనంతరం 2019లో చామరాజనగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు.

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

- పార్టీ ఇండోర్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ
- బీజేపీలో చేరే అవకాశం!

ఇండోర్ : కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఇండోర్ లోక్‌సభ అభ్యర్థి అక్షయ్ బామ్ పోటీ నుంచి తప్పుకున్నారు. నియోజకవర్గంలో ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. అక్షయ్ త్వరలో బీజేపీలో చేరే అవకాశం ఉంది. మే 13న నాల్గవ దశ పోలింగ్ జరగనున్న ఇండోర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ సిట్టింగ్ ఎంపీ శంకర్ లాల్వానీపై కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని బరిలో నిలబెట్టింది. కాగా, మధ్య ప్రదేశ్ ప్రభుత్వంలోని క్యాబినెట్ మంత్రి కైలాశ్ విజయవర్గియా ఈ పరిణామాన్ని ధ్రువీకరిస్తూ, అక్షయ్ బామ్‌ను పార్టీలో చేర్చుకునేందుకు ఆయనకు సాదర స్వాగతం పలికారు. 'ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వి.డి.శర్మ నాయకత్వంలో ఇండోర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ జీని బీజేపీలోకి స్వాగతిస్తున్నాం' అని విజయవర్గియా తన అధికారిక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. సూరత్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ నాయకుడు నీలేష్ కుంభానీ సమర్పించిన నామినేషన్ పత్రం తిరస్కరించబడిన కొంతకాలం తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. పత్రంపై ఉన్న సంతకాలు తమవి కావని ముగ్గురు ప్రతిపాదకులు జిల్లా రిటర్నింగ్ అధికారికి వెల్లడించడంతో ఈ తిరస్కరణకు దారితీసింది. అదేవిధంగా సూరత్‌కు కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేష్ పడసాల కూడా ఇలాంటి కారణాల వల్ల అదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. సూరత్ మాజీ కార్పొరేటర్ అయిన కుంభాని గతంలో 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కమ్రేజ్ నియోజకవర్గంలో పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. ఏప్రిల్ 22న సూరత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి ముఖేష్ దలాల్ పోటీ లేకుండా విజయం సాధించారు. బీఎస్‌పీ నుంచి ఒకరితో సహా ఇతర అభ్యర్థులందరూ ఒకరి తర్వాత ఒకరు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఇది జరిగింది. ఇదిలాఉండగా, అక్షయ్ బామ్ తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీకి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలతో సహా అనేక మంది పార్టీ కార్యకర్తలు పార్టీ మారి బీజేపీలో చేరిన తరుణంలో ఇండోర్ నుంచి పోటీ చేసే అవకాశాన్ని కాంగ్రెస్ బామ్‌కు ఇచ్చింది. ఓటర్ల సంఖ్య పరంగా రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన ఇండోర్‌లో 25.13 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు : కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఇండోర్ లోక్‌సభ స్థానం అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ పార్టీ సోమవారం ఇది 'ప్రజాస్వామ్యానికి ముప్పు' అని పేర్కొంది. ఎన్నికల సంఘం 'మరోవైపు చూసుకున్నప్పుడు' స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయా అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అభ్యర్థి తర్వాత అభ్యర్థిని బెదిరిస్తున్నారని ఆరోపించింది. ఈ పరిణామంపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాటేని ప్రశ్నించగా, 'సందేహాస్పదమైన ఈ పెద్ద మనిషికి రాష్ట్రంలో అనేక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉన్నాయి. అతనిపై వచ్చిన ఆరోపణలలో ఒకటి హత్య, ఇది సహజమైనది కాదు. ఎవరైనా తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుని బీజేపీలో చేరడం సాధారణమైనది కాదు' అని అన్నారు. 'భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని మేము చెప్పినప్పుడు, మేము మాట్లాడే ముప్పు ఇదే. అభ్యర్థులను మభ్యపెట్టడం, ఉపసంహరించుకునేలా వారిపై ఒత్తిడి తీసుకురావడం, వారిని భయపెట్టడం, వారి ప్రతిపాదకులను భయపెట్టడం అదే జరుగుతోంది' అని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ముప్పు ఎక్కడిది అని పార్టీని ప్రశ్నించే వారు 'ప్రజాస్వామ్యానికి ముప్పు' ఉందని ఇది సూచిస్తుందన్నారు. 'ప్రజలు ఎన్నికల పోటీల నుంచి తప్పుకోవాల్సిన రీతిలో బెదిరింపులు వచ్చినప్పుడు స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు ఎక్కడ ఉంటాయి. ప్రధాన మంత్రి ద్వేషపూరిత ప్రసంగానికి బాధ్యత వహించడు. కానీ ఆ పార్టీ అధ్యక్షుడికి నోటీసు వెళుతుంది. అప్పుడు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎక్కడ జరుగుతాయి. అభ్యర్థుల తర్వాత అభ్యర్థులు బెదిరింపులకు గురవుతున్నప్పుడు ఎన్నికల సంఘం మరో వైపు చూస్తున్నప్పుడు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎక్కడ జరుగుతాయి' అని శ్రీనాటే అన్నారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

ఏడాదిలో ఇది తొమ్మిదో ఘటన

జైపూర్: దేశంలోనే 'కోచింగ్ హబ్'గా ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడం లేదు. చదువు ఒత్తిడి, వ్యక్తిగత కారణాలతో వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న మరో విద్యార్థి తాజాగా తనువు చాలించాడు. హర్యానా రోహ్‌తక్‌కు చెందిన సుమిత్ (20) నీట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. ఏడాదిగా కోటాలోని కున్హాడి ల్యాండ్‌మార్క్ సిటీలో ఓ హాస్టల్‌లో ఉంటూ... స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అతడు తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సుమిత్‌కు అతడి తల్లిదండ్రులు ఆదివారం ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అనుమానం వచ్చి వారు హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేశారు. సిబ్బంది సుమిత్ గది వద్దకు వెళ్లి చూడగా... డోర్ లాక్ చేసుకొని రూమ్‌లో ఉరేసుకొని కనిపించాడు. దీంతో హాస్టల్ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కాగా, కోటాలో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు కలకలం రేపుతున్నాయి. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకూ ఇది తొమ్మిదో ఘటన కావడం గమనార్హం. గతేడాది ఏకంగా 30 మంది దాకా విద్యార్థులు పాణాలు విడిచారు.

లారీని ఢీకొన్న మినీ వ్యాన్

9 మంది దుర్మరణం

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లోని బెమెతరా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున జిల్లాలోని కతియా వద్ద ఆగి ఉన్న లారీని ఓ మినీ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది మరణించారు. మరో 23 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో నలుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు బెమెతరా జిల్లా కలెక్టర్ రణ్‌వీర్ శర్మ చెప్పారు. గాయపడినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, వారిని మెరుగైన చికిత్స కోసం ఎయిమ్స్ రాయ్‌పూర్‌కి తరలించామని వెల్లడించారు. బాధితులంతా ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు.

రేవణ్ణను అరెస్టు చేయాలి...కాంగ్రెస్ నిరసనలు

బెంగళూరు: వందల మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్‌కు చెందిన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ సోమవారం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ (33)పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దసంఖ్యలో కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు, హుబ్లీ, హసన్, బెంగుళూరు, ఇతర ప్రాంతాలలో వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. బెంగళూరులో కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయం వెలుపల అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా నేతృత్వంలో నిరసన తెలిపారు. వందలాది మంది మహిళలపై జరిగిన లైంగిక వేధింపుల కేసు భయంకరమైందని... దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని లాంబా అన్నారు. 'గత కొన్నేళ్లుగా వందలాది మంది మహిళలపై ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపులకు పాల్పడిన, క్రూరంగా వ్యవహరించిన 3వేలకు పైగా వీడియోలు కన్నడిగులతో పాటు భారతీయుల మనస్సాక్షిని కదిలించాయి' అని ఆమె అన్నారు. హసన్ ఎంపీ, లోక్‌సభ ఎన్నికల అభ్యర్థి రేవణ్ణ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు అనేక వీడియోలు బయటకు రావడంతో... ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివారం ప్రత్యేక దర్యాప్తు బృందా (సిట్)న్ని ఏర్పాటు చేసింది. ప్రజ్వల్‌కు సంబంధించిన స్పష్టమైన వీడియో క్లిప్‌లు ఇటీవల హసన్‌లో వైరల్‌గా మారాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో జేడీ(ఎస్) ఎన్డీఏలో చేరింది. ఏప్రిల్ 26న పోలింగ్ జరిగిన హసన్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్డీఏ అభ్యర్థిగా ప్రజ్వల్ పోటీ చేశారు. ఓటింగ్ ముగిసిన తర్వాత వీడియోలు బయటకు రావడంతో రేవణ్ణ దేశం విడిచి పారిపోయాడని పోలీసు వర్గాలు తెలిపాయి. వందలాది మంది మహిళలపై రేవణ్ణ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరి ప్రభుత్వానికి లేఖ రాసిన నేపథ్యంలో కర్నాటక ప్రభుత్వం సిట్ దర్యాప్తు ప్రారంభించింది. ముగ్గురు ఐపీఎస్ అధికారులతో కూడిన సిట్‌కు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సీఐడీ) విజయ్ కుమార్ సింగ్ నేతృత్వం వహిస్తుండగా... మిగిలిన ఇద్దరు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుమన్ డి పెన్నేకర్, మైసూరు పోలీసు సూపరింటెండెంట్ సీమా లత్కర్. ఈ కేసులో విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని సిట్‌ను కర్నాటక ప్రభుత్వం ఆదేశించింది.

యూసీసీ బీజేపీ రాజకీయ ఎత్తుగడ: మమత

జంగీపూర్: ఎన్నికలకు ముందు ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) ని బీజేపీ రాజకీయ ఎత్తుగడగా ఉపయోగిస్తోందని, దాని వల్ల హిందువులు ప్రయోజనం పొందరని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం విమర్శించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని మైనారిటీల ప్రాబల్యం ఉన్న జంగీపూర్ నియోజకవర్గంలో జరిగిన సభలో మమతమాట్లాడుతూ... మొదటి, రెండో దశలో పోలింగ్ సరళిని గమనించి... ఓటమిని ఊహించిన నేపథ్యంలో బీజేపీ ఓట్ల కోసం ప్రజల మధ్య విభజన చిచ్చు పెడుతోందని అన్నారు. 'ఎన్నికలు వచ్చినప్పుడల్లా మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి వారు ఏదో ఒక అంశాన్ని ఉపయోగిస్తారు. ఈసారి వారు సీఏఏ గురించి మాట్లాడుతున్నారు. అది ఫలానా వర్గానికి వ్యతిరేకం అని ప్రచారం చేస్తున్నారు. కానీ ఈ యూసీసీ రాజకీయ వాక్చాతుర్యం తప్ప మరొకటి కాదు. హిందువులు దాని నుండి ప్రయోజనం పొందలేరు' అని ఆమె చెప్పారు. రోజురోజుకూ దేశవ్యాప్తంగా బీజేపీపై వ్యతిరేకత పెరుగుతోందని మమత పేర్కొన్నారు. ముఖ్యంగా మొదటి రెండు దశల ఓటింగ్ తర్వాత ఇది స్పష్టంగా కనిపిస్తోందన్నారు. 'మొదటి రెండు దశల్లో ఓటింగ్ సరళి, శాతాన్ని చూసిన తర్వాత బీజేపీ ఓడిపోయిందని నమ్మకంగా చెప్పగలం. మిగిలిన ఐదు దశల్లోనూ వారికి ఎదురుదెబ్బ తప్పదు. బీజేపీలో ఓటమి భయం పట్టుకుంది' అని చెప్పారు.

వేడెక్కుతున్న హిందూ మహాసముద్రం



న్యూఢిల్లీ: 2020-2100 మధ్య హిందూ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 1.4 డిగ్రీల నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉన్నదని తాజా అధ్యయనం అంచనా వేసింది. దీనివల్ల వడగాడ్పులు, తుపానులు తీవ్రతరం కానున్నాయని హెచ్చరించారు. రుతు పవనాలు గతి తప్పుతాయని, సముద్ర మట్టాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పుణే 'ఐఐటీఎం' వాతావరణ శాస్త్రవేత్త రాక్సీ మాథ్యూ ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు. హిందూ మహాసముద్రం వేడెక్కడం కేవలం ఉపరితలానికే పరిమితం కాలేదని, సముద్రం 2000 మీటర్ల లోతు వరకు వేడి ప్రభావం ఉంటున్నట్టు అధ్యయనం పేర్కొన్నది.

కాంగ్రెస్ యోచనను జరగనివ్వను: మోదీ

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే ప్రధానంగా జాతీయ పార్టీల కీలకనేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ తరుణంలో ప్రధాని మోదీ కర్నాటక రాష్ట్రంలోని బాగల్‌కోట్ ర్యాలీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ యోచిస్తోందని, దానిని జరగనివ్వబోమని మోదీ స్పష్టం చేశారు. ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ వర్గాలు ఇప్పుడు బీజేపీ వెంట ఉన్నందున మైనారిటీలను ప్రసన్నం చేసుకునేందుకే కాంగ్రెస్ ఈ ప్రతిపాదన చేసిందని మోదీ అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం హక్కులను లాక్కోవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. మన రాజ్యాంగం మత ఆధారిత రిజర్వేషన్‌లను అంగీకరించదు. నా దళిత, ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ సోదర సోదరీమణులకు కాంగ్రెస్ ఉద్దేశాల గురించి అవగాహన కల్పించాలని కోరుకుంటున్నాను. మతం ప్రాతిపదికన ఈ వ్యక్తులు తమ ఓటు బ్యాంకును సురక్షితంగా ఉంచుకునేందుకు అంబేద్కర్ ఇచ్చిన మీ హక్కును దోచుకోవాలని ప్లాన్ చేస్తున్నారు అని మోదీ ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఎంపీలు బీజేపీకి చెందిన వారేనని మోదీ పేర్కొన్నారు. ర్యాలీలో బీజేపీ సీనియర్ నాయకుడు బీఎస్ యడియూరప్ప, బీజేపీ అభ్యర్థులు, బాగల్‌కోట్, విజయపుర ఎంపీలు పీసీ గద్దిగౌడర్, రమేశ్ జిగాజినాగి పాల్గొన్నారు.

తగ్గిన పోలింగ్...

కమలంలో కలవరం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని అవకాశాలు ఉపయోగించుకుంటున్న బీజేపీకి మొదటి రెండు దశల పోలింగ్ శాతం ఆందోళన కలిగిస్తోంది. పోలింగ్ శాతం తగ్గడం, ప్రత్యేకించి బీజేపీకి పట్టున్న రాష్ట్రాల్లో మరింత తగ్గడం కమలనాథులను కలవరపాటుకు గురి చేస్తోంది. 2019లో గెలిచిన సీట్లను నిలబెట్టుకోవడం కూడా ఆ పార్టీకి కష్టంగా కనిపిస్తోంది. రెండో దశలో భాగంగా 13 రాష్ట్రాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగింది. ఈ 88 స్థానాల్లో గత ఎన్నికల్లో 63 చోట్ల ఎన్డీయే గెలిచింది. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే ఈసారి బీజేపీకి ఈ స్థానాల్లో భారీగా కోత పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. 370 సీట్లు సొంతంగా సాధిస్తామని చెబుతున్న బీజేపీకి రెండో దశ మింగుడు పడటం లేదు. దేశంలో మోదీ గాలి ఉన్నట్టు బీజేపీ కొంతకాలంగా ప్రచారం చేసుకుంటున్నది. ఏ ఎన్నికల్లో అయినా హవా ఉంటే ఓటింగ్ పెరుగుతుంది. అయితే, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్ శాతం తగ్గింది. 2019లో ఈ 88 సీట్లలోని 85 సీట్లలో 69.64 శాతం పోలింగ్ జరగగా ఈసారి 63.5 శాతం మాత్రమే నమోదైంది. ఓటింగ్ శాతం తగ్గడం ఒక ఎత్తైతే... బీజేపీకి పట్టున్న ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో మరింత తగ్గడం ఆ పార్టీని కలవరపాటుకు గురి చేస్తోంది. రెండో విడతలో యూపీలోని 8 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కేవలం 54.85 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. ఇవే స్థానాలకు 2019లో 62 శాతం ఓటింగ్ జరిగింది. బీజేపీ కచ్చితంగా గెలుస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్న మధురలో గత ఎన్నికలకు ఇప్పటికి ఓటింగ్ 12 శాతం తగ్గింది. ఘజియాబాద్‌లో 6 శాతం తగ్గింది. గత ఎన్నికల్లో ఎన్డీఏ దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసిన మహారాష్ట్రలో 59.6(2019లో 63 శాతం), బీహార్‌లో 57 శాతం(2019లో 63 శాతం), రాజస్థాన్‌లో 64.07 శాతం(2029లో 68 శాతం) నమోదైంది. మరోవైపు బీజేపీకి పెద్దగా పట్టులేని కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం బీజేపీ వ్యతిరేక పవనాలకు సూచిక అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఓటింగ్ శాతం ఎందుకు తగ్గిందనే అంశానికి సంబంధించి రాజకీయ విశ్లేషకులు అనేక కారణాలు చెబుతున్నారు. ముఖ్యంగా ఓటర్లను పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరేలా చేసే భావోద్వేగ అంశాలేవీ ఈ ఎన్నికల్లో పని చేయడం లేదని, తద్వారా రామమందిర నిర్మాణం, మతపరమైన అంశాలను తెరపైకి తేవడం ద్వారా లబ్ధి పొందాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు సఫలం అవుతున్నట్టు కనిపించడం లేదంటున్నారు. గత ఎన్నికల్లో సొంతంగా 303 సీట్లు సాధించిన బీజేపీ ఈసారి 370 సాధిస్తామని చెప్తున్నది. ఇది జరగాలంటే బీజేపీకి చాలా సానుకూలత ఉండాలి. ప్రజలు ఉత్సాహంగా వచ్చి ఓటేయాలి. కానీ, ఓటర్లు ఉత్సాహంగా వచ్చి ఓటేసేందుకు సిద్ధంగా లేరని, పెరిగిన ధరలు, నిరుద్యోగం, పదేళ్ల ప్రభుత్వంపై వ్యతిరేకత ఓటింగ్ తగ్గడానికి కారణం కావొచ్చని అభిప్రాయపడుతున్నారు. 102 స్థానాలకు తొలి దఫా పోలింగ్‌లోనూ గత ఎన్నికలతో పోల్చితే దాదాపు నాలుగు శాతం ఓటింగ్ తగ్గింది. రెండో దశలో ఎన్నికలు జరిగిన 88 స్థానాల్లో కేరళలోని 20 స్థానాల్లో నాలుగైదు స్థానాలు మినహా ఎక్కడా బీజేపీ కనీస పోటీ ఇచ్చే స్థితిలో లేదు. గత ఎన్నికల్లో భారీగా సీట్లు గెలిచిన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, కర్నాటక, మహారాష్ట్రలోనూ ఈసారి బీజేపీకి ఎదురుగాలి వీస్తున్నది. రైతుల్లో వ్యతిరేకత, నిరుద్యోగ సమస్య, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి అంశాలు బీజేపీకి ప్రతికూలంగా మారినట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ప్రతిపక్షాల విచ్ఛిన్నం బీజేపీకి కలిసిరాగా ఈసారి ప్రతిపక్షాలు కొంతవరకు ఐక్యంగా పోరాడుతుండటం, ఎక్కడికక్కడ ప్రాంతీయ పార్టీలు బలం పుంజుకోవడంతో బీజేపీ అభ్యర్థులు గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. ఇంతకుముందు బీజేపీకి మద్దతుగా నిలిచిన రాజ్‌పుత్‌లు, జాట్లు, మరాఠాలు ఈసారి దూరమైనట్లు అంచనాలు ఉన్నాయి. ఈ అన్ని అంశాలు కలిసి బీజేపీ విజయావకాశాలకు గండి కొడుతున్నాయనే అనుమానాలు ఉన్నాయి. రెండో దశలో ఎన్నికలు జరిగిన 88 సీట్లలో గత ఎన్నికల్లో గెలిచిన 63 సీట్ల కంటే ఈసారి లెక్క తగ్గే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ప్రధాని మోదీపై పిటిషన్... కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీని ఎన్నికల్లో పోటీకి అనర్హుడిని చేయాలని వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకుగాను మోదీని ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హుడిని చేయాలని వేసిన పిటిషన్ ఢిల్లీ హైకోర్టు ముందు సోమవారం విచారణకు వచ్చింది. ఇటీవల ఉత్తరప్రదేశ్ ఫిలిబిత్‌లో నిర్వహించిన ప్రచార సభలో ప్రధాని మోదీ దేవుని పేరు చెప్పి ఓట్లు అడిగారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పిటిషనర్ కోరారు. అయితే పిటిషన్‌లో విచారించదగ్గ మెరిట్స్ ఏవీ లేవని కోర్టు అభిప్రాయపడింది.

శ్రుతిమించుతున్న ప్రభుభక్తి

బీజేపీకి ఓటు వేయకపోతే మీ ఇళ్లు బుల్డోజర్‌తో పడగొడ్తామని ఆ పార్టీ నాయకులు బెదిరించడంలో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. కానీ బీజేపీ అనుకూల ప్రభుత్వాధికారులలో కూడా ప్రభు భక్తి శ్రుతి మించి పోతోంది. అధికారులు కొన్ని చోట్ల ఇల్లిల్లూ తిరిగి ఇదే మాట చెప్తున్నారు. సూరత్ లోక్‌సభ స్థానంలో మోసానికి పాల్పడి, కాంగ్రెస్ అభ్యర్థిని బతిమాలో, బెదిరించో బీజేపీ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించడంలో అధికారుల పాత్రే ఎక్కువ. ప్రత్యర్థి నామినేషన్ ఉపసంహరించుకున్నందు వల్ల రంగంలో బీజేపీ అభర్థి ఒక్కరే మిగిలారు కనక ఆయన గెలిచినట్టు ప్రకటించేశాం అని ఎన్నికల నిర్వహణాధికారి ప్రకటించడంలోనూ తప్పు లేకపోవచ్చు. కానీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)లో నోటా మీట నొక్కే సదుపాయం కూడా ఉంది. కొందరు ఓటర్లైనా నోటా మీట నొక్కే అవకాశం లేకుండా పోవడం ఎన్నికల ప్రక్రియను వక్రీకరించడమే. గత 19వ తేదీన తొలివిడత, 26వ తేదీన రెండో విడత పోలింగ్ జరిగిన తరవాత ఓటింగ్ సరళనిబట్టి చూస్తే ఈ 190 సీట్లలోనూ బీజేపీ మెజారిటీ సీట్లు సంపాదించే అవకాశం కనిపించడం లేదని అనుభవజ్ఞులైన విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం వారి ఊహే కావచ్చు. ఈ అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. మోదీలోనూ, బీజేపీలోనూ ఈ భయం విపరీతంగానే ఉంది.

మోదీ, బీజేపీని వెంటాడుతున్న భయం

గత పది సంవత్సరాల పాలనలో మోదీ ఏం సాధించారు, ప్రజలకు ఏం మేలు జరిగింది అన్న అంచనాలను పక్కన పెట్టినా మోదీ పాలనపై ఓటర్లలో ఒక రకమైన అలసట కనిపిస్తోంది. ఒక్కో దశ పోలింగ్ పూర్తి అయిన కొద్దీ ముందు నుంచి పరుషంగా మాట్లాడే మోదీ మాట తీరులో కొట్టొచ్చినట్టు కర్కశత్వం కనిపిస్తోంది. ఇది ఆయనలో గూడు కట్టుకున్న భయానికే ప్రతీక. అందువల్లే ఆయన మాటల్లో మునుపటికన్నా అబద్ధాల జోరు పెరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే "మీ మంగళ సూత్రాలు కూడా లాక్కుని ముస్లింలకు ఇచ్చేస్తారు" అనడంలో ఆయనను ఆవహించిన భయ తీవ్రతను తెలియజేస్తోంది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలలో లేని విషయాలను ప్రస్తావించి మోదీ నానా యాగీ చేయడం ఆయన అసత్యాన్ని ఎంత గట్టిగా నమ్ముతారోననడానికి ఉదాహరణ. తాను ఏం చెప్పినా జనం నమ్ముతారన్న విశ్వాసం ఆయనలో గూడు కట్టుకుంది. ఇది ఒక వేపున ఆయన అహంకారానికి చిహ్నం అయినట్టే ఆయనలో సడలుతున్న విశ్వాసానికి, ఎన్ని అబద్ధాలైనా చెప్పి ఎన్నికలలో గెలవాలన్న తాపత్రయానికి కూడా అంతకన్నా ఎక్కువ నిదర్శనమే.

రామ మందిరం నిర్మించిన కీర్తి కారణంగా ఓట్లు పడవన్న గ్రహింపు ఆయనకు ఉంది. అందుకే ఇప్పుడు మతాల వారీగా జనాన్ని మరింతగా చీల్చడానికి, ముస్లింల విషం చిమ్మడానికి అసత్య ప్రచారాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. మతం పేర భయపెట్టడం, విద్వేషం రెచ్చగొట్టడం, అబద్ధాలాడడం, ప్రత్యర్థులను దూషించడం ఆయనకు నిత్యకృత్యం అయిపోయింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ మీద మోదీ చేస్తున్న పద్ధతి చూస్తే బూతోచ్ఛాటనకు ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తోంది. రాహుల్ అంటే మోదీ దృష్టిలో పెద్ద బూతం కిందే లెక్క. మొన్నటి దాకా రాహుల్‌ను రకరకాల పేర్లతో తిట్టిపోశారు. రాహుల్ ఎందుకు కొరగానివాడని తేల్చేశారు. కానీ ఇప్పుడు రాహుల్ పేరెత్తితేనే ఒణికి పోతున్నారు. సోనియా గాంధీ లోక్‌సభకు పోటీ చేయకుండా రాజస్థాన్ నుంచి రాజ్యసభ సభ్యురాలు కావడమూ ఆయనకు అభ్యంతరకరమై పోయింది. కింది స్థాయి బీజేపీ నాయకులైతే మొన్నటి దాకా చికిత్సకోసం పదే పదే విదేశాలకు పయనమయ్యే సోనియా ఇప్పుడు ఎందుకు వెళ్లడం లేదని దీర్ఘాలు తీస్తున్నారు.

రెండు విడతల్లోనూ పోలింగ్ మందకొడిగానే జరిగింది. ఒక్క పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే పోలింగ్ చురుకుగా సాగింది. మిగిలిన అయిదు విడతల్లోనూ పోలింగ్ శాతం పెరుగుతుందన్న భరోసా లేదు. ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉండడానికి ఎండల తీవ్రత ఎక్కువ అన్నది కుంటి సాకు మాత్రమే. 2014, 2019 ఎన్నికలు కూడా ఎండాకాలంలోనే జరిగాయి. పోలింగ్ మందకొడిగా సాగడం అధికార పక్షానికి నష్టం అన్న వాదనలు వినిపిస్తున్నాయి. తక్కువ పోలింగ్ అయినప్పుడల్లా ప్రతిపక్షం గెలుస్తుందన్న హామీ కూడా లేదు. జనాన్ని ఒక రకమైన నిర్లిప్తత ఆవహించింది. ముస్లింలను చొరబాటుదార్లు అని నిందించడం వెనక మోదీలో గూడుకట్టుకున్న ముస్లింలంటే ద్వేషం మాత్రమే కారణం కాదు. ముస్లింలు ఎక్కువ సంఖ్యలో ఉన్న చోట్ల పోలింగ్ మందకొడిగా జరగడానికి, ముస్లింలను ఓటు వేయకుండా చేయడానికి ఎన్నికల నిర్వహణాధికారులు శక్తివంచన లేకుండా ప్రయత్నించారు.

దక్షిణ అసోంలోని కరీంగంజ్ నియోజక వర్గంలో ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లు రావడానికి ప్రయత్నిస్తే 25వ తేదీన ఏకంగా ఆరు రైళ్లను రద్దు చేశారు. అంటే ముస్లిం ఓటర్లను అడ్డుకోవడానికి సాధ్యం అయిన అన్ని ఎత్తులూ ఎత్తుతున్నారు. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న చాలా నియోజక వర్గాలలో పోలింగ్ ఉధృతంగా సాగింది. ఇది కూడా మోదీని ఓడించి తీరాలన్న సంకల్ప బలానికి రుజువు కావొచ్చు. ఇక ఎన్నికల ప్రచారంలోనైతే బీజేపీ నాయకుల దిగజారుడుతనానికి అంతే లేదు. కాంగ్రెస్ గెలిస్తే మంగళ సూత్రాలు, సంపద లాక్కుంటారని మోదీ అంటే షరియా ప్రవేశ పెడ్తారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుసలు కొడ్తున్నారు. కాంగ్రెస్ విజయం సాధిస్తే గో మాసం తినడం పెరిగిపోతుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ కన్నీళ్లు కారుస్తున్నారు. కానీ గో మాంసం ఎగుమతి చేసే అతి పెద్ద కంపెనీ యజమాని బీజేపీ నాయకుడే. ఈ వాస్తవాన్ని యోగి కప్పిపుచ్చుతున్నారు. నానా విధ పద్ధతుల్లో ముస్లింలను రాక్షసులుగా చిత్రిస్తున్నారు.

పోలింగ్ తక్కువగా నమోదు కావడానికి మరో కారణం కూడా ఉండొచ్చు. తొలి దశ పోలింగ్ పూర్తయ్యేదాకా మోదీతో సహా బీజేపీ అగ్రనాయకులందరు "అబ్‌కా బార్ 400 పార్" అని విరామం లేకుండా నినదించారు. పోలింగ్ సరళి అర్థం అయిన తరవాత ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదు. హిందూ ఓటర్లు బయటకు వచ్చి ఓటు వేయకపోవడానికి మరో కారణం ఎటూ 400 సీట్లకన్నా ఎక్కువ వచ్చేటప్పుడు మనం ఓటెయ్యకపోతేనేం అన్న ఉదాశీనత హిందూ ఓటర్లలో ఉన్నట్టుంది. పైగా మోదీ పాలన అంటే అలసట భావం పెరుకు పోయినందువల్ల కూడా ఓటర్లలో ఉత్సాహం తగ్గిందేమో. అన్నింటికన్నా మించి మోదీ అత్యంత ప్రీతి పాత్రమైన హిందు-ముస్లిం నినాదం ఈ సారి ఓటర్లను ఆకర్షించినట్టు లేదు. ఈ రెండు ధోరణులు నిస్సందేహంగా బీజేపీకి నష్టం కలిగించే అంశాలే.

ముస్లింల బూచి చూపించాలని చేసే ప్రయత్నమూ బెడిసి కొడ్తోంది. ఎందుకటే అది కృత్రిమంగా కలగ జేసిన భయం. ఎప్పుడు మత కలహాలు జరిగినా ముస్లింలను కాపాడిన హిందువులున్నట్టే హిందువులను కాపాడిన ముస్లింలూ ఉన్నారు. ఒకరిని ఒకరు రక్షించడానికే రెండు మతాల వారూ ప్రయత్నించారు. అయితే మోదీ సంకుచిత రాజకీయాలు అంతిమంగా ముస్లింలకు నష్టం కలిగించక మనవు. ఇతర ముస్లిం దేశాల వారు మోదీ దూషణ పర్వాన్ని అభ్యంతర పెట్టకపోవడం మన ముస్లింలకు ఆపద వస్తే ఇతర ముస్లిం దేశాలు బాధ్యత, సానుభూతి వ్యక్తం చేసే పరిస్థితి లేదు. ఇతర దేశాల్లో ఉన్న ముస్లిం జనాభా దాదాపు 200 కోట్లు ఉంటుంది. ఏమైనా ముస్లింలను ఓ మూలకు నెట్టేసే కుట్ర మాత్రం మోదీ హయాంలో జోరుగా సాగుతోంది.

మోదీ వెకిలి ప్రచారం మోదీ భక్తులను ఆకర్షించవచ్చు. కానీ ముస్లింల మీద ద్వేషం చివరకు హిందువులకే నష్టంగా పరిగణించక తప్పదు. హిందువులకు ముస్లింల నుంచి ప్రమాదం ఉంది అన్న మోదీ ప్రచారంలో వాస్తవాన్ని ఎంత తొందరగా గ్రహిస్తే అంత మంచిది. మొత్తం మీద పరిస్థితి గాడిదకు కొమ్ములు మొలిచినట్టే ఉంది.

ఛత్రపూర్
సీపీఐ కంచుకోట

2014 వరకు ఖాతా తెరవని బీజేడీ

కార్మికనేత ప్రధాన్ విస్తృత ప్రచారం

16 ఎన్నికల్లో 8సార్లు అరుణపతాక రెపరెప

ఒడిశాలోని గంజాం జిల్లా ఛత్రపూర్ శాసనసభా నియోజకవర్గం భారత కమ్యూనిస్టు పార్టీకి కంచుకోట. 1951 నుంచి 2019 వరకు జరిగిన 16 ఎన్నికలలో 8సార్లు ఈ నియోజకవర్గంలో అరుణపతాకం రెపరెపలాడింది. 1961, 1967, 1971, 1977, 1980, 1990, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికలలో ఈ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. 1997 డిసెంబరు 26న రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజూ జనతాదళ్ (బీజేడీ) ఏర్పడినప్పటికీ 2014 ఎన్నికల వరకు ఆ పార్టీ ఈ నియోజకవర్గంలో ఖాతా తెరవలేదు. 2000లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మాత్రమే బీజేపీ ఈ నియోజకవర్గంలో గెలుపొందింది. 1951 ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించగా, 1957, 1974, 1985, 1995 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. మొత్తంగా ఇప్పటి వరకు జరిగిన 16 ఎన్నికలను చూస్తే సీపీఐ అత్యధికంగా 8సార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, బీజేడీ రెండు సార్లు, బీజేపీ, స్వతంత్రులు ఒక్కొక్క సారి చొప్పున విజయం సాధించారు. ఈ దఫా జరుగుతున్న ఎన్నికలలో సీపీఐ అభ్యర్థిగా ప్రముఖ కార్మికనాయకుడు, ప్రజల మనిషి గుర్నాధ్ ప్రధాన్‌ను బరిలో నిలిపింది. ఈ నెల 25వ తేదీన ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కార్మికులు, కర్షకులు, శ్రమజీవులు, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో ప్రధాన్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. కంకి-కొడవలి గుర్తుపై ఓటువేసి ప్రజల కోసం పనిచేసే సీపీఐ అభ్యర్థినే ఈ నియోజకవర్గం నుంచి గెలిపించుకుంటామని ప్రజలు హామీ ఇస్తున్నారు.

1951లో జరిగిన శాసనసభా ఎన్నికలలో ఈ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి వి. సీతారామయ్య విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతిరాజ్ ప్రోహరాజ్ గెలుపొందారు. 1961, 1967, 1971 ఎన్నికలలో సీపీఐ అభ్యర్థి లక్ష్మణ్ మహాపాత్ర విజయదుందుబి మోగించారు. 1974, 1995 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి దైత్రీ బెహరా, 1985లో అశోక్ కుమార్ చౌదరి, 2000లో బీజేపీ అభ్యర్థి రామచంద్ర పాండా, 2009లో సీపీఐ అభ్యర్థి అదికంద శేథి, 2014లో బీజేడీ అభ్యర్థి రామచంద్ర పాండా, 2019లో అదే పార్టీకి చెందిన సుభాశ్‌చంద్ర బెహరా ఎన్నికయ్యారు. దాదాపు దశబ్దకాలం తరువాత తిరిగి సీపీఐ అభ్యర్థి విజయం సాధించేందుకు ఇండియా కూటమి శ్రేణులు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధితోనే ప్రజాసమస్యల పరిష్కారమవుతాయని నియోజకవర్గ ప్రజలు గమనించారు. కమ్యూనిస్టు ఎమ్మెల్యే ఉన్నప్పుడు, లేనప్పుడు నియోజకవర్గ అభివృద్ధిని బేరీజు వేసుకుని ఈ దఫా సీపీఐ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లు భావిస్తున్నారు. ప్రముఖ కార్మికనాయకుడు అయిన ప్రధాన్‌కు నియోజకవర్గంలో మంచి పలుకుబడి ఉన్నది. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎనలేని కృషి చేశారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. ప్రచారం కోసం వెళుతున్న ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికి ఈ ఎన్నికలలో తప్పక గెలిపిస్తామని హామీ ఇస్తున్నారు. ఇండియా కూటమి ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రధాన్‌కు ఓటువేసి గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. ప్రజానాట్యమండలి కళాకారుల అట, పాట, మాటతో గ్రామాలు హోరెత్తుతున్నాయి.

మోదీని వ్యతిరేకిస్తున్న
యుద్ధ వీరులు

యుద్ధ వీరులుగా పేరు పొందిన సామాజిక వర్గాలు క్రమంగా మోదీకి వ్యతిరేకులుగా మారిపోతున్నారు. ఉత్తర భారత్‌లో రాజపుత్రులు (ఠాకూర్లు లేదా క్షత్రియులు), సిక్కులు, జాట్లు, భిల్లులు, పసీలు మోదీ వ్యతిరేకులుగా మారుతున్నారు. ఎన్నికలు జరుగుతున్న సమయంలో కుల సమీకరణల్లోనూ మార్పు వస్తోంది.

బహుజనుల తరఫున మాట్లాడే బీఎస్పీ అధినేత మాయావతి ఇటీవల గాజియాబాద్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ క్షత్రియులను సమర్థించారు. ఇప్పటి దాకా మాయవతి క్షత్రియులను వ్యతిరేకిస్తారన్న అభిప్రాయం ఉంది. ఆమె అగ్రవర్ణానికి చెందిన బ్రాహ్మణులకు ఎక్కువ అవకాశాలు ఇచ్చే వారు. కాని ఈ సారి ఆమే అయిదుగురు ఠాకూర్లకు బీఎస్పీ తరఫున పోటీ చేసే అవకాశం ఇచ్చారు.

బీజేపీ తమను సవతి పిల్లల్లా చూస్తోందని ఇటీవల ఠాకూర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవడం కోసం అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్ వాదీ పార్టీ, మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ ఆ వర్గాన్ని చేరదీస్తున్నాయి. దీనికి కారణం ఉంది. ముస్లింలు, దళితుల తరవాత పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో మూడవ అతి పెద్ద సామాజిక వర్గం క్షత్రియులదే. గాజియాబాద్, షహరాన్ పూర్, మీరట్, కైరానా, గౌతమ బుద్ధ నగర్, ముజఫ్ఫర్ నగర్, బాగ్‌పత్, అలీగఢ్‌లో క్షత్రియులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. అయినప్పటికీ ఈ వర్గం వారికి మోదీ నాయకత్వంలోని బీజేపీ కొద్ది స్థానాల్లో పోటీ చేయడానికి మాత్రమే వీరికి టికెట్లు ఇచ్చింది. ఠాకూర్లు కనక



బీజేపీకి వ్యతిరేకులుగా మారితే ఆ ప్రభావం గుజరాత్ నుంచి బీహార్-బెంగాల్ సరిహద్దు దాకా ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది మూడో సారి అధికారంలోకి రావాలన్న మోదీ ఆకాంక్షల మీద నీళ్లు చల్లినట్టు అవుతుంది. ఠాకూర్లు మోదీకి దూరం అవుతున్నారని గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని ఠాకూర్లు బీజేపీ మీద గుర్రుగా ఉన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ లాంటి నియోజకవర్గాలలో బ్రాహ్మణేతర వర్గాల అభ్యర్థులను సమర్థిస్తున్నారు. గత పదేళ్ల కాలంలో బ్రాహ్మణాధిపత్యం కొనసాగడమే దీనికి కారణం.

సమరాంగణం 2024

ఏలూరులో అతివలే న్యాయ నిర్ణేతలు

▸ తొలి ఎన్నికలలోనే సీపీఐ ప్రాతినిధ్యం ▸ వలస పక్షులదే విజయం

కోండ్రు సుబ్బారావు

వీరమాచనేని విమలాదేవి

పుట్టా మహేష్ యాదవ్

కారుమూరి సునీల్

రాజకీయ చైతన్యానికి ప్రతీక ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం అనడంలో సందేహం లేదు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలో రాజకీయాలు ఎప్పటికప్పుడు కొత్త పోకడలను ప్రదర్శిస్తాయి. మారుతున్న కాలం ప్రకారం ప్రజల ఆలోచన ధోరణిలో కూడా వేగవంతమైన మార్పు చోటు చేసుకుంటుంది. రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండే ఏలూరు ప్రజానీకం ఎక్కువ శాతం వివిధ వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తుంటారు. ఒకసారి విజయం సాధించిన అభ్యర్థి పనితీరు, గుణగణాలను బట్టి వచ్చే ఎన్నికలలో గెలుపోటములు ఆధారపడి ఉంటాయి. ప్రజోపయోగ కార్యక్రమాలు చేసిన అభ్యర్థులకు మాత్రమే ఏలూరు ప్రజలు పట్టడం కడతారంటే రాజకీయ చైతన్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. 1952 నుంచి నేటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా ఒకే సామాజిక వర్గానికి చెందినవారు 14 మంది ఎన్నికయ్యారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఇద్దరు, వైశ్యుల నుంచి ఒకరు, వెలమ సామాజిక వర్గం నుంచి ఒకరు ఎన్నికయ్యారు. 17 సార్లు జరిగిన ఎన్నికలలో సీపీఐ 2 సార్లు, కాంగ్రెస్ పార్టీ 9 సార్లు, తెలుగుదేశం 5సార్లు, వైసీపీ ఒకసారి విజయం సాధించింది. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంతో సంబంధంలేని కావూరి సాంబశివరావు రెండు సార్లు, సూపర్ స్టార్ కృష్ణ, తణుకు పట్టణానికి చెందిన చిట్టూరి సుబ్బారావు చౌదరి ఇక్కడ నుంచి గెలుపొందడం విశేషం.

తొలినాళ్లలోనే సీపీఐ విజయం

1952లో ఏలూరు పార్లమెంటు ద్విసభ్య నియోజక వర్గంగా ఉండేది. అప్పుడు గెలిచిన ఇద్దరూ దళిత నేతలు కావడం విశేషం. సీపీఐ తరఫున కోండ్రు సుబ్బారావు, కిసాన్ మజ్దూర్ పార్టీ తరఫున బీఎస్ మూర్తి విజయం సాధించారు. 1957లో కాంగ్రెస్ పార్టీ తరఫున కేఎం. వేద కుమారి సీపీఐ అభ్యర్థి వీరమాచనేని విమలాదేవిపై విజయం సాధించారు. అనంతరం 1962లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో వేద కుమారిపై సీపీఐ తరఫున వీరమాచినేని విమలాదేవి విజయం సాధించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే ఈ నియోజకవర్గానికి సీపీఐ ప్రాతినిధ్యం వహించి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది. 2019 ఎన్నికలలో వైసీపీ తరఫున కోటగిరి శ్రీధర్ ఎన్నికయ్యారు.

యువకుల మధ్య రసవత్తర పోరు....

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీయే కూటమి తరుపున కడప జిల్లాకు చెందిన పుట్టా మహేష్ యాదవ్, వైసీపీ తరఫున పౌర సరఫరాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తనయుడు కారుమూరి సునీల్ కుమార్ పోటీలో ఉన్నారు. గత ఎన్నికల సరళని పరిశీలిస్తే ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన అభ్యర్థులే విజయం సాధించడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్నికల ప్రచారంలో ఇద్దరూ హోరాహోరీగా తలపడుతున్నారు. అభ్యర్థులు ఆర్థిక బలం, రంగ బలంతో నియోజకవర్గంలో ఇప్పటికే యువత, తటస్తుల ఓట్లను పొందడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

దీటైన పోటి ఇస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి కావూరి లావణ్య

ఇండియా కూటమి అభ్యర్థిగా కావూరి లావణ్య పోటీ చేస్తున్నారు. సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీపార్టీ ఆమెకు పూర్తిగా మద్దతు పలికి ప్రచారంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. వామపక్షాలు గత పది ఏళ్ల కాలంలో బీజేపీ వైఫల్యాలు, రాష్ట్రంలో ఐదసంవత్సరాల పాలనలో జరిగిన దౌర్జన్య కాండ, రాక్షస పాలన ప్రజలకు వివరించడంలో కృతకృత్యులయ్యారు. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల చేసిన పర్యటన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జోష్ ను నింపింది. దీంతో ఓట్ల చీలిక ఏ పార్టీ ఏరాజయానికి కారణం అవుతుందో అని వైసీపీ,టీడీపీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అతివలే న్యాయ నిర్ణేతలు...

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం జనవరి నాటికి 16,24,416 ఓటర్లు ఉండగా పురుషులు 7,93,897 కాగా, మహిళలు 8,30, 390 ఉన్నారు. ప్రధానంగా ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పోలవరం, నూజివీడు, కైకలూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మహిళల ఓటింగ్ సరళిని బట్టి అభ్యర్థుల గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి.

- విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు

రాజకీయ వలసలు

▸ స్థానికేతరులకు ఎంపీ సీట్లు ▸ ధన బలమే కొలబద్ద
▸ గెలుపు ఆరాటంలో వైసీపీ, ఎన్డీఏ

సార్వత్రిక ఎన్నికల బరిలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీల నుంచి వలస నేతలు దిగారు. ప్రాంతాలు, నియోజకర్గాలతో సంబంధం లేనివారికి ప్రధాన పార్టీలు లోక్‌సభ టిక్కెట్లు కట్టబెట్టాయి. అధికార వైసీపీతోపాటు ఎన్డీఏ కూటమి పార్టీలు ధన బలం కలిగిన వారికి సీట్లు కేటాయించగా, కొన్ని చోట్ల మాత్రం సామాజిక సమీకరణలతో సీట్లను సర్దుబాటు చేశారు. ప్రాంతాలు, జిల్లాలను దాటి మరీ వారికి సీట్లు కేటాయించారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలుపే లక్ష్యంతో అధికార వైసీపీ, ఎన్డీఏ కూటమి పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

కడప జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బీజేపీ రాజ్యసభ సభ్యులు సీఎం రమేశ్ అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన గతంలో టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై, బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చంద్రబాబు నుంచి మిగిలిన ముఖ్యనేతలందరితోనూ ఆయనకు పూర్తి సంబంధాలున్నాయి. దానికితోడు బీజేపీలో చేరాక ఆయన రాజకీయ పరిచయాలు విస్తృతమయ్యాయి. అత్యంత ధనవంతుడైన సీఎం రమేశ్‌కు అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సంబంధాలు లేవు. రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురంధేశ్వరిని బరిలోకి దించారు. ఆమె బాపట్ల జిల్లాకు చెందిన వారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశాఖ నుంచి ఎంపీగాపోటీ చేసి, కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పొత్తుల్లో భాగంగా ఆమెకు రాజమహేంద్రవరం ఎంపీ సీటును అధిష్టానం ఖరారు చేసింది. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా స్థానికేతరుడైన పుట్టా మహేశ్ యాదవ్‌ను అధిష్టానం ఖరారు చేసింది. ఏలూరు టీడీపీ టిక్కెట్ కోసం ఎన్ఆర్ఐ గొరుముచ్చు గోపాల్ యాదవ్ ఎంతో ప్రయత్నించారు. చాలా కాలం నుంచి ఏలూరు పార్లమెంట్ నియోజకర్గ పరిధిలో ఆయన సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. చివరి దశలో ఆయనను కాదని పుట్టా మహేశ్ యాదవ్‌కు సీటు ఖరారు చేశారు. దీంతో కలత చెందిన గొరుముచ్చు గోపాల్ యాదవ్ వైసీపీలో చేరారు. మాజీ ఎంపీ, టీడీపీ నేత మాగంటి బాబు కూడా ఈ సీటును ఆశించారు. ఆయనను కూడా టీడీపీ పక్కన పెట్టి, పుట్టా మహేశ్‌ను ఖరారు చేసింది.

వైసీపీ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్న వారిలో కొందరు వలస నేతలున్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా అధిష్టానం బరిలోకి దించింది. ఒంగోలులో నెలకొన్న రాజకీయ పరిణామాలతో వ్యూహాత్మకంగా చెవిరెడ్డి పేరును సీఎం జగన్ ఖరారు చేశారు. 2019లో ఒంగోలు వైసీపీ ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డి గెలుపొందారు. ఆయన తనయుడు ఢిల్లీ లిక్కర్ కేసులో అప్రూవర్‌గా మారడం, ఆ కేసు ఇంకా కొనసాగడం వెరసి మాగుంటకు టిక్కెట్‌కు ఇచ్చేందుకు వైసీపీ అధిష్టానం నిరాకరించింది. మాగుంటకు టిక్కెట్ ఇవ్వాల్సిందేనంటూ... ఒంగోలు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి అధిష్టానంపై గట్టిగా ఒత్తిడి పెంచారు. చివరి దశకు వరకు ఆయన ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. మాగుంట స్థానంలో చెవిరెడ్డిని వ్యూహాత్మకంగా అధిష్టానం నిలిపింది.

సీఎం రమేశ్

పుట్టా మహేశ్ యాదవ్

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

హిందూపురంలోక్‌సభ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి జలరాశి శాంతకు స్థానికంగా అంత రాజకీయ సంబంధాలు లేవు. కర్నాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన ఆమెను వైసీపీ ఎన్నికల బరిలోకి దించించి. పార్టీలో చేరిన రోజునే హిందూపురం లోక్‌సభ టిక్కెట్‌ను ఖరారు చేసింది. నరసరావుపేట లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను పోటీలోకి దించారు. 2014, 2019 ఎన్నికల్లో నెల్లూరు టౌన్ ఎమ్మెల్యేగా అనిల్‌కుమార్ యాదవ్ గెలుపొందారు. 2019లో ఆయన సీఎం జగన్ కేబినెట్‌లో జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. సీఎంకు నమ్మినబంటుగా పేరొందారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు టౌన్ నుంచి మళ్లీ ఆయన పోటీకి సిద్ధపడగా, అక్కడ వైసీపీలోని వర్గవిభేదాలు, రాజకీయ సమీకరణలు అనిల్‌కుమార్‌కు అనుకూలంగా లేవు. దీనికితోడు నరసరావుపేటలో ఎంపీ అభ్యర్థిగా బీసీని నిలబెట్టాలని వైసీపీ నిర్ణయించింది. దీంతో అక్కడి సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను గుంటూరుకు వెళ్లాలని వైసీపీ సూచించగా, అందుకు ఆయన నిరాకరించారు. ఈలోగా నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ పేరు ఖరారు చేశారు. దీంతో లావు శ్రీకృష్ణదేవరాయలు వైసీపీకి రాజీనామాచేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ వలస నేతలంతా ఎన్నికల్లో తమ రాజకీయ భవితవ్యాన్ని పరిశీలించుకోనున్నారు.

- విశాలాంధ్ర బ్యూరో-
అమరావతి

పండగొచ్చింది జాగ్రత్త!

చూసేవారికి అదో అడంబరాల వేడుక
వినేవారికి అబద్ధాల పండగ
అదే ఎన్నికల పండగ.
ఎందరో నేతల ఎన్నో కలల పండగ
నిలబడ్డ వ్యక్తి ఓసారి అంచనాగా చేసే ఖర్చు
సామాన్యుడు ఐదేళ్ళ పండగల ఖర్చుకు ఐదురెట్లెక్కువే
పండగ ఖర్చులో ప్రతివారు ఆనందం వెతుక్కుంటే
ఎన్నికల ఖర్చులో భవిష్యత్ లాభం వెతుకులాట
నాటి హరిశ్చంద్రుడైనా నేటి ఎన్నికల్లో
అందమైన అబద్ధాలు చెప్పాల్సిందే
తాటిచెట్టు కాయలకు పాలు తెప్పించాల్సిందే!
ఎన్నికకు ముందు యువత భవితంతా తెలియని ఆనందమయమే..
ఎన్నికైన తర్వాతి కాలంలో భవితంతా తెలియని అయోమయమే
మారుతున్న అభిరుచిని ముందుకునెట్టి
మత్తులోనో, మాటల మత్తుతోనో జోకొడితేచాలు
నాలుగేళ్ళవరకు నలుసైపోయినా పర్వాలేదు
రూపుకట్టిన అబద్ధాలు నిలువెత్తున తిరుగుతుంటాయి
ఆ మాటలకు మైమరపొచ్చి నిద్రపోయావో
కలలో కదిలిఊడిన పన్నుకు పన్ను కట్టాలి!
ఇంటి రంగుమారినా,
ఎండలో ఒంటి రంగుమారినా పన్నే పన్ను?
కలలోనే కదాని ఆదమరిస్తే
ఇలలో ఇసుమంతైనా సుఖం గల్లంతే
మీట నొక్కితే మాటలకు అడ్డుపడే
నోటొస్తోందనుకుంటే
ఉచితాలే అన్నిటా సముచితాలనుకుంటే
భవిష్యత్ బతుకుబాటలో తరతరాలు
బద్ధకానికి బ్రాండ్‌గా మారిపోవాలి!
మంచిచేస్తే మనసుల్లో మనిషిగా రూపుకడతారు
మేం దేవరాజులమని విర్రవీగిన మహారాజులే
చరిత్ర చివరాంకాన చిత్తుగా మిగిలిపోయిన పాఠాలు
గుర్తొస్తాయేమో ఓ మననం చేసుకో.
ఓటరు
ఎన్నికల వేళ నువ్వే కింగ్‌మేకర్
భవిష్యత్ అంటే మీ పిల్లలు ఆనందంగా...
బతకడమంటే...మనదైన ఇంట్లో ప్రశాంతంగా..
పండగ ఆగమనపు ఆనందం
మళ్ళీ వచ్చే ఏడాది దాని రాకవరకు మనసుల్లోనే..
ఈ అబద్ధాల పండగ ఆగమనం
పొరపాటు జరిగితే
ఐదేళ్ళు బతుకంతా
మాసిన అతుకులబొంతలు, కనిపించని వాతలు

- ముని

ఉంగుటూరులో గెలుపు ఎవరిది?

వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ హోరాహోరీ

ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం ప్రత్యేకం. ఇక్కడ ఏ పార్టీ గెలిస్తే రాష్ట్రంలో అదే పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంటు ఉన్నది. గత 12 ఎన్నికల్లో ఇదే సెంటిమెంటు ఫలించింది. దీంతో తాజా ఎన్నికల్లోనూ ఉంగుటూరు కీలక స్థానంగా మారింది. ప్రస్తుతం ఈ స్థానం నుంచి ఎన్డీయే తరపున జనసేన అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు, వైసీపీ తరపున ప్రస్తుత ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు), కాంగ్రెస్ అభ్యర్థిగా పాతపాటి హరి కుమార రాజు పోటీ చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. అయితే వైసీపీ, టీడీపీ మధ్య హోరాహోరీ పోరు సాగబోతోంది.

పత్సమట్ల ధర్మరాజు (జనసేన)

పాతపాటి హరికుమార్ రాజు (కాంగ్రెస్)


పుప్పాల శ్రీనివాసరావు (వైసీపీ)

ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గం 1967లో ఏర్పడింది. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఆ తరువాత వైసీపీ గెలిచింది. నియోజక వర్గంలో ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు, భీమడోలు మండలాలు ఉన్నాయి. ఇక్కడి 214 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,5,334 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,01,152 మంది పురుషులు, 1,04,177 మంది మహిళలు ఉన్నారు.

భౌగోళిక పరిస్థితులు: జిల్లాల పున:ర్విభజనలో ఉంగుటూరు నియోజకవర్గం పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఏలూరు జిల్లా పరిధిలోకి వచ్చింది. భౌగోళికంగా మెట్ట, డెల్టా, కొల్లేరు, అటవీ ప్రాంతం మధ్యలో ఉంది. తూర్పున తాడేపల్లిగూడెం నియోజకవర్గం (పశ్చిమ గోదావరి), పడమర దెందులూరు నియోజకవర్గం (ఏలూరు జిల్లా), దక్షిణాన ఉండి నియోజకవర్గం (పశ్చిమ గోదావరి జిల్లా), ఉత్తరాన గోపాలపురం నియోజకవర్గం (తూర్పుగోదావరిజిల్లా) ఉన్నాయి. జాతీయ రహదారి ఏలూరు గోదావరి కాలువ, రైల్వే లైను సమాంతరంగా ఏలూరు తాడేపల్లిగూడెం పట్టణాల మధ్యలో విస్తరించి ఉంది. వరి పంటోత్పత్తి ఉంగుటూరు మండలంలో ఎక్కువ. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో చేపలు, ఇతర ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు తరలించే సదుపాయం ఉంటుంది.

బస్టాండు... ఆసుపత్రి లేవు

ఉంగుటూరు నియోజకవర్గం ఏర్పడి 75ఏళ్లు అయ్యింది. 12 సార్లు ఎన్నికలు జరిగాయి. నేటికీ అభివృద్ధికి లేదు. ఉంగుటూరుకు బస్టాండు లేదు, ఆసుపత్రి లేదు. ఉన్న రైల్వేస్టేషన్ కూడా మూతబడింది. నియోజకవర్గంలో రోడ్లు అంతంత మాత్రమే కాగా ఏలూరు ప్రధాన కాలువ పై వంతెన సంగతిని పట్టించుకున్న వారే లేరు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చే నేతలకు స్థానికుల సమస్యలు పట్టడంలేదన్నది ఉంగుటూరు ప్రజల ఆవేదన. కాగా, గణపవరం, నిడమర్రులో చేపల చెరువులు ఉండటంతో నీరు కలుషితమై రెండు మండలాల్లో తాగునీటి సమస్య ఉంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు నాయకులు చొరవ చూపడంలేదు.

గత ఎన్నికల్లో గెలుపోటములు

1967 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చింతలపాటి సూర్యచంద్ర వరప్రసాద మూర్తిరాజు 4,006 ఓట్ల మెజార్టీతో స్వతంత్ర అభ్యర్థి వట్టి రంగ పార్థసారథిపై గెలిచారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థి మూర్తి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థి మాగంటి భూపతిరావుపై కడియాల సత్యనారాయణ (కాంగ్రెస్) 16,375 ఓట్లతో విజయం సాధించారు. 1983లో చింతలపాటి మూర్తిరాజు(కాంగ్రెస్)పై కంఠమనేని శ్రీనివాసరావు (టీడీపీ) 25,180 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 1985 ఉప ఎన్నికల్లో కంఠమనేని శ్రీనివాసరావు (టీడీపీ)... దశక లక్ష్మణశాస్త్రి (కాంగ్రెస్)పై పోటీ చేసి 29,519 ఓట్లతో విజయం సాధించారు. 1989లో కంఠమనేని శ్రీనివాసరావు(టీడీపీ)పై చావా రామకృష్ణారావు (కాంగ్రెస్) 20,104 ఓట్లతో గెలుపొందారు. 1994లో కొండ్రెడ్డి విశ్వనాథం (టీడీపీ).. కాంగ్రెస్ అభ్యర్థి చావా రామకృష్ణారావు (కాంగ్రెస్)పై 18,862 ఓట్లతో విజయం సాధించారు. 1999లో కొండ్రెడ్డి విశ్వనాథం(టీడీపీ)... చావా రామకృష్ణారావు(కాంగ్రెస్)పై 3,302ఓట్లతో గెలిచారు. 2004లో వట్టి వసంతకుమార్ (కాంగ్రెస్), టీడీపీ అభ్యర్థి ఇమ్మడి రాజేశ్వరిపై 15,661 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2009లో వట్టి వసంత కుమార్ (కాంగ్రెస్)... గన్ని లక్ష్మీకాంతం (టీడీపీ)పై 6,459 ఓట్లతో విజయం సాధించారు. 2014లో గన్ని వీరాంజనేయులు (టీడీపీ)... పుప్పాల శ్రీనివాసరావు (వైసీపీ)పై 8,930 ఓట్లతో గెలుపొందారు. 2019లో పుప్పాల శ్రీనివాసరావు(వైసీపీ)... గన్ని వీరాంజనేయులు (టీడీపీ)పై 33,153 ఓట్ల మెజార్టీలో గెలిచారు.

- విశాలాంధ్ర-ఉంగుటూరు

బీజేపీ, దాని తొత్తు పార్టీలను ఓడిద్దాం

- 'ఇండియా' అభ్యర్థి మురళిని గెలిపించాలి
- తిరుపతి ఎన్నికల ప్రచారంలో రాఘవులు, మధు, హరినాథ్‌రెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి:
దళిత, మహిళ, మైనార్టీ, గిరిజనులపై దాడులు చేస్తూ...అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీని, దానికి అంట కాగుతున్న టీడీపీ కూటమి, వైసీపీని ఓడించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఇండియా కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న పి.మురళిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మురళి విజయాన్ని కాంక్షిస్తూ తిరుపతిలోని సుందరయ్య నగర్‌లో రాఘవులు, హరినాథరెడ్డి, సీపీఎం నేత మధు, ఇతర సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. భారీ రోడ్‌షో నిర్వహించారు. రాఘవులు మాట్లాడుతూ తిరుపతిలో అధికార పార్టీ నేతలు టీటీడీని నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తిరుపతి పరిశుభ్రత కోసం దేవస్థానం నిధులు వెచ్చిస్తుంటే బీజేపీ అడ్డు తగలడం హేయమన్నారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం దేశంలో చేయని అరాచకం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసిందని, కరోనా కాలంలో కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని, సీఏఏ పేరుతో మైనార్టీల్లో అభద్రతాభావం పెంచిందని రాఘవులు విమర్శించారు. మణిపూర్‌లో మహిళలను ఊచకోత కోసి దుర్మార్గానికి పాల్పడిందన్నారు. టీడీపీ, వైసీపీ పదేళ్లుగా కేంద్రానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాయన్నారు. ప్రత్యేక హోదా లేదు. రాజధాని లేదు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్ ఊసే ఎత్తడం లేదు. చివరకు విశాఖ స్టీలు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టినా ప్రేక్షక పాత్ర వహించాయని ఆగ్రహం వెలిబుచ్చారు. వైసీపీ, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఓటమితోనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పి.మధు మాట్లాడుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ, దాని కూటమిని, ఓడించాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు చెందిన 25 మంది ఎంపీలు బీజేపీకే మద్దతు పలకడం దారుణమన్నారు. తిరుపతిలో పేదలకు ఇళ్లు, టీటీడీ కార్మికులకు కనీస వేతనాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ డబ్బు, వారసత్వ రాజకీయాలు, పార్టీ ఫిరాయింపులతో ఓటర్లను మభ్యపెడుతున్నారని, దానికి భిన్నంగా సీపీఐ అభ్యర్థి మురళిని నిలబెట్టామని తెలిపారు.

కార్మికులు, పేదల సమస్యలపై నిత్యం పోరాడుతున్న మురళిని కంకి-కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ధన రాజకీయాలకు పాల్పడుతున్న పార్టీలపై చర్యలు తీసుకోకుండా ఎన్నికల సంఘం ప్రేక్షకపాత్ర వహించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గోపాల్ రెడ్డి, సీపీఐ అభ్యర్థి పి.మురళి మాట్లాడారు. ప్రచా రంలో భాగంగా మురళి టీ స్వయంగా తయారుచేసి... రాఘవులు, మధు, హరినాథరెడ్డికి అందజేశారు. రోడ్ షోలో సీపీఐ నేతలు ఎ.రామానాయుడు, టీ.జనార్ధన్, సి.పెంచలయ్య, జె.విశ్వనాథ్, శివారెడ్డి, కె.రాధాకృష్ణ, గురవయ్య, రవి, నదియా, సీపీఎం నేతలు కె.మురళి, నాగరాజు, సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి నేతలు గుర్రప్ప, నాగరాజు, కాళయ్య, సూరి తదితరులు డప్పులతో నృత్యాలు ప్రదర్శించారు.

సీపీఐ అభ్యర్థుల విజయం కోసం
మనోరమ రూ.30 వేల ఎన్నికల నిధి

విశాలాంధ్ర-విజయవాడ:
భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ సీనియర్ నాయకులు అమరజీవి సంకు అప్పారావు కుమార్తె సంకు మనోరమ రూ. 30వేలు విరాళాన్ని అందజేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జి. కోటేశ్వరరావు, కమలాపురం నియోజకవర్గ అభ్యర్థి గాలి చంద్ర విజయాన్ని కాంక్షిస్తూ ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున మొత్తం రూ. 30వేలు విరాళంగా ఆమె అందజేశారు. సీపీఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విరాళం అందజేసిన మనోరమకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

మచిలీపట్నంలో 29వేల సేకరణ

చట్టసభలలో ప్రశ్నించే గొంతు అయిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో కష్టజీవులు పార్టీ ఎన్నికల నిధిని సేకరించారు. మతతత్వ శక్తుల కొమ్ముకాస్తున్న వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని ఓడించి సెక్యులర్ వ్యవస్థను, భారత రాజ్యాంగాన్ని పరీక్షించేందుకు, కమ్యూనిస్టు అభ్యర్థుల గెలుపు కోసం వివిధ వర్గాల శ్రమజీవుల నుంచి మహిళా సమాఖ్య కార్యకర్త మోదుమూడి అరుణకుమారి ఉడతాభక్తిగా సేకరించిన నిధిని సీపీఐ నగర కోశాధికారి యర్రంశెట్టి ఈశ్వరరావు ద్వారా రాష్ట్ర కేంద్రానికి సోమవారం పంపారు. వై బాల సుబ్బలక్ష్మి 10,000, శేషగిరిరావు 5,000, ఎం. పద్మావతి 3,000, వై రామలక్ష్మి, సుజాత, శ్రీనివాసరావు చిన్నబ్బాయి వెయ్యి రూపాయలు చొప్పున, వాకాలయ్య, రత్నగిరి, అజయ్ కుమార్, థెరిస్సా, సుజాత, ఉష, సరోజ, సలాం 500 చొప్పున, సత్యారావు, సీతారాం, దినేష్, నవీన్, లోవ కుమార్, కృష్ణకాంత్ రెండు వందల చొప్పున ఎన్నికల నిధి ఇచ్చిన వారిలో ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలిచి నిధి ఇచ్చిన వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అభివందనలు తెలిపారు.

'జంగాల' ప్రచారానికి విశేష స్పందన

విశాలాంధ్ర -ప్రత్తిపాడు:
ఇండియా కూటమి బలపర్చిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ సోమవారం ప్రత్తిపాడులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రత్తిపాడు మెయిన్ రోడ్‌లో ఇంటింటికీ తిరుగుతూ... తన ఎన్నికల గుర్తు కంకి కొడవలిపై ఓట్లు వేసి గుంటూరు ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మసీదు సెంటర్‌లో ముస్లిం సోదరుల నుంచి జంగాలకు విశేష స్పందన లభించింది. తమ మద్దతు ఇండియా కూటమికే నంటూ నినదించారు. ఆటో కార్మికులు సైతం ముందుకు వచ్చి జంగాల అజయ్‌కుమార్‌కు మద్దతు తెలియజేశారు. రిక్షా కార్మికులు కూడా ప్రచారంలో పెద్దసంఖ్యలో భాగస్వాములు కావడం విశేషం. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, జిల్లా సమితి సభ్యులు జంగాల చైతన్య, నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు, సహాయ కార్యదర్శి సోమేపల్లి వీరాంజనేయులు, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి అమరలింగేశ్వరావు, మండల కార్యదర్శి మామిడి అంకమ్మ రావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కుంచాల అంకమ్మరావు, గోపిరెడ్డి, నాగిరెడ్డి, నియోజవర్గ కార్యవర్గ సభ్యులు సిద్ధి రవి, వెంకట్రావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ వస్తే భవిష్యత్తు అంధకారమే

రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చర్చ జరగాలి: జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి:
కేంద్రంలో మళ్లీ మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వస్తే దేశ ప్రజల భవిష్యత్తు అంధకారం అవుతుందని, రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రోటరీ సమావేశ మందిరంలో 'ఇండియా' కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సీపీఐ ఆత్మీయ సమావేశం నిర్వహించింది. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయిన సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోదీని ఓడించకపోతే దేశం ప్రమాదంలో పడుతుందన్నారు. 'ఇండియా' కూటమి ద్వారానే దేశం, రాజ్యాంగం సురక్షితంగా ఉంటాయని, ఆ దిశగా ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన అంశాన్ని కాంగ్రెస్ పార్టీపై నెట్టేసి అన్ని పార్టీలు లబ్ధి పొందుతున్నాయన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లనే రాష్ట్ర విభజన జరగలేదని, అన్ని రాజకీయ పార్టీల అంగీకారంతోనే విభజన జరిగిందని గుర్తు చేశారు. రాజ్యసభలో చర్చల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఐదు సంవత్సరాలు ప్రత్యేక హోదా అని కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తే, అప్పటి ప్రతిపక్ష బీజేపీ నాయకుడు వెంకయ్య నాయుడు 10 సంవత్సరాలు కావాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో తిరుపతి సభ సాక్షిగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారని, కానీ పదేళ్లుగా ఆ ఊసే లేదన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ రైల్వే జోన్ వంటి విభజన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. పోరాడవలసిన ప్రాంతీయ పార్టీలు టీడీపీ, వైసీపీ కేంద్రంతో కుమ్మక్కై రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. 2024కి దేశ ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి వస్తుందని గొప్పలు చెప్పుకున్న కేంద్ర ప్రభుత్వం అది తమ గొప్పతనం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుతం ఏ ప్రభుత్వం ఉన్నా దేశ ఆర్థిక వ్యవస్థ మూడో స్థానంలో ఉంటుందనే విషయాన్ని గతంలోనే ఆర్థిక వేత్తలు చెప్పారనే విషయాన్ని విస్మరించకూడదని తెలిపారు. జీడీపీ వల్ల సామాన్యుల బతుకులు మారవని, వారి ఆదాయ వనరులు మెరుగైనప్పుడే దేశం ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై విస్తృత చర్చ జరగాలని, బీజేపీ చేసిన మోసాలను ఇంటింటికీ వివరించాలని సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ సమావేశంలో 'ఇండియా' కూటమి బల పరిచిన కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, అసెంబ్లీ అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్, యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంతరావు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి బోని తాతారావు, నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి రుత్తల శ్రీరామ్ మూర్తి, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బి.శ్రీనివాసరావు, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి జగతా శ్రీనివాసరావు ప్రసంగించారు. మత్స్యకార సంఘం రాష్ట్ర నాయకుడు జగన్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, రాము నాయుడు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణ మాఫీ

కమలాపురం అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్:
దేశంలో, రాష్ట్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రూ.రెండు లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేస్తామని కమలాపురం అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర తెలిపారు. సోమవారం పెండ్లిమర్రి మండలం నంది మండలం గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ... పదేళ్ల కాలంలో ఏంచేసిందో చెప్పాలన్నారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని... పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పులు చేసి ఆత్మ చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కూడా రైతులకు ఇవ్వాల్సిన వ్యవసాయ పరికరాలు ఏవీ ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం రైతులకు తీవ్రంగా అన్యాయం చేసిందన్నారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి కమలాపురం ఎమ్మెల్యేలగా తనను, హస్తం గుర్తుపై ఓటు వేసి కడప పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహబూబ్ బాషా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీ బాదుల్లా, వీ గంగా సురేష్, నాయకులు కే మునెయ్య, నాగార్జున, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.400

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఉపాధి కూలీలకు రోజుకు 400 రూపాయలు అందిస్తామని గాలి చంద్ర తెలిపారు. సోమవారం చింతకొమ్మదిన్నె మండలం కేసీ కెనాల్ పూడిక తీస్తున్న ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి... వారి సమస్యలు తెలుసుకున్నారు. దేశంలో బీజేపీ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రతి బడ్జెట్‌లోనే నిధులు తగ్గిస్తోందని... పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలి ధర పెంచలేదన్నారు.

రామచంద్రయ్య గెలుపు కోసం
గ్రామగ్రామాన ప్రచారం

విశాలాంధ్ర-పత్తికొండ:
ఇండియా కూటమి బలపర్చిన సీపీఐ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి, పేదల నాయకుడు పి.రామచంద్రయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. సోమవారం ఆయన అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్య సీపీఐ మండల కార్యదర్శి డి.రాజాసాహెబ్‌తో కలిసి చందోలి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలుసు కొని ఓట్లు అభ్యర్థించారు. అలాగే పులికొండ, కనక దిన్నె, కోతి రాళ్ల, దూదేకొండ గ్రామంలో ఇంటింటికి తిరిగి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి రామచంద్రయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే తనకు ఓట్లేసి గెలిపిస్తే... అసెంబ్లీలో రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం వినిపిస్తానన్నారు. నియోజకవర్గం అభివృద్ధి తో పాటు , సాగు, తాగునీరు, టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కు కృషి చేస్తానన్నారు. గిడ్డయ్య మాట్లాడుతూ... కంకి కొడవలి గుర్తుపై ఓటేసి అసెంబ్లీ అభ్యర్థి రామచంద్రయ్యను, హస్తం గుర్తుపై ఓటువేసి కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి మండల కార్యదర్శి విరుపాక్షి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, నాగేంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష అభ్యర్థులను గెలిపించండి: ఓబులేసు

విశాలాంధ్ర-ఏలూరు:
ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ, దాని మిత్రపక్షాలను, రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసిన వైసీపీని ఓడించి కాంగ్రెస్, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు పిలుపు నిచ్చారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ జరుగుతున్న ఎన్నికల ప్రచార సరళిని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఎన్డీఏ ముసుగులో బీజేపీ... భారతదేశ లౌకిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి, మత సామరస్యానికి తూట్లు పొడిచిందనీ, ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతుందని విమర్శించారు. ఏపీలో వైసీపీ, సంక్షేమ పథకాల ముసుగులో రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, విభజన హామీలు అమలు జరగాలని కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కార్మిక లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందని, ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే పాల్గొన్నారు.

'ఇండియా'ను గెలిపించుకోవడమే కర్తవ్యం

సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర- రెడ్డిగూడెం:
దేశంలో నిరంకుశ పాలన సాగిస్తున్న ఎన్‌డీఏ కూటమిని ఈ సార్వత్రిక ఎన్నికలలో చిత్తు చిత్తుగా ఓడించి, కాంగ్రెస్, వామపక్ష, అనేక లౌకికవాద పార్టీలు, శక్తులతో ఏర్పడిన 'ఇండియా' కూటమిని గెలిపించుకుని రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి పౌరుడు కంకణబద్ధులు కావాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

మైలవరం నియోజకవర్గం నుంచి సీపీఐ, సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి బొర్రా కిరణ్ విజయాన్ని కాంక్షిస్తూ, రెడ్డిగూడెం మండల పరిధిలోని శాయన్నపాలెం, బూరుగగూడెం, పాత, కొత్త దళితవాడలు తదితర గ్రామాలలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుద్ధి రమేష్, మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, సీపీఐ రెడ్డిగూడెం మండల కార్యదర్శి అడపా సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పిన్నుబోయిన చిన్న నరసింహం, రాఘవులు, తిరుపతయ్య, జమ్మి వెంకటేశ్వరరావు, పిల్లి వీరస్వామి, జంగం నాగేశ్వరరావు, ఆదాం, బాలకృష్ణ, రమాదేవి, జమ్మి వెంకటరత్నమ్మ, మోంద్రు అక్కమ్మ, పిల్లి ప్రకాశం, దాసరి భారతి, పిల్లి పార్వతి తదితరులతో కలిసి సభలు, సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలను మత, కుల, జాతి, భాష ప్రాంతాలు, సంస్కృతుల పేర్లతో ఛిన్నాభిన్నం చేస్తున్నారని విమర్శించారు. దేశ సంపదను అదాని, అంబానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టి, రాముడి పేరుతో ప్రజలను మరోమారు మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కుట్రలను ఓడించి 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బుద్ధి రమేష్, మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గాకోటేశ్వరరావు ప్రసంగిస్తూ విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న వల్లూరు భార్గవ్, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి బొర్రా కిరణ్‌ను గెలిపించుకునేందుకు పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు గట్టిగా కృషి చేయాలని కోరారు.

చంద్రబాబూ... ముస్లింలతో ఆటలొద్దు: ఖాదర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ముస్లిం జీవితాలతో చంద్రబాబు ఆటలాడుతున్నారని వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ భాషా మండిపడ్డారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబూ ... ముస్లింలను మోసగించాలని ప్రయత్నిస్తే పుట్టగతులుండవన్నారు. ముస్లిం రిజర్వేషన్లు నాలుగు శాతం తీసేస్తానంటావా అని ప్రశ్నించారు. ముస్లిం జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు. బీజేపీ నేతలంతా... అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామంటున్నారని, ఇటీవల కేంద్రమంత్రి పీయూష్ గోయల్ రాష్ట్రానికి వచ్చి ఇదే ప్రకటన చేశారని గుర్తుచేశారు. బీజేపీ... ముస్లింల రిజర్వేషన్‌లు తీసేస్తామంటే చంద్రబాబులో స్పందన లేదని, సుప్రీంకోర్టులో ఉంది అంటూ దాటి వేస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగితే... కేసులు పెట్టిన వ్యక్తి చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ముస్లింల రిజర్వేషన్‌లపై అభిప్రాయం చెప్పాలని నిలదీశారు.

సోరెన్ భార్య కల్పన నామినేషన్

రాంచీ: జైలులో ఉన్న జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పన సోమవారం గాండే అసెంబ్లీ ఉప ఎన్నికకు జేఎంఎం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. 48 ఏళ్ల కల్పనతో పాటు ముఖ్యమంత్రి చంపై సోరెన్, మరిది బసంత్ సోరెన్, కాంగ్రెస్ జార్ఖండ్ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్, మంత్రులు అలంగీర్ ఆలం, సత్యానంద్ భోక్తా తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు మే 20న ఈ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో గిరిదిహ్ జిల్లాలో ఆ స్థానం ఖాళీ అయింది. నామినేషన్ దాఖలు చేసిన వెంటనే కల్పన మాట్లాడుతూ 'మాకు మరో అవకాశం ఇవ్వండి. మీ ఆశీస్సులు ఇవ్వండి... ఈ ఎన్నికలు గాండే ప్రజల కోసం జరుగుతున్నాయి' అని అన్నారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి గురించి అడిగిన ప్రశ్నకు, రాష్ట్రంలో, దేశంలో సంకీర్ణం బలంగా ఉందని ఆమె నొక్కి చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.